క. అంతఃపురమునఁ గలిగిన
యింతుల వ్యాపారములకు నెద విముఖంబై
యెంతయు నీసుందరిపయి
సంతతసుస్నేహమునకు స్థానంబయ్యెన్.

(అని యందఱును నిష్క్రమించుచున్నారు.)

తృతీయాంకము

[అప్పుడు పరివ్రాజికయొక్క పరిచారికయైన సమాహితిక ప్రవేశించుచున్నది.]

సమా—"సమాహితికా! నీవు పోయి రాజుగారి తోఁటలో నిమ్మవం డొకటి తీసికొనిరమ్ము." అని పూజ్యురా లయిన పరివ్రాజిక నా కాజ్ఞాపించినది. అందుచేత నే యుద్యానవనపాలకురా లయిన మధురికను వెదకఁబోయెదను. (కొంచెము నడిచి చూచి) అదిగో కాంచనాశోకమును జూచుచు మధురిక నిలుచున్నది. దానివద్దకుఁ బోయి కుశలవార్త యడిగెదను.

[అప్పు డుద్యానవన పాలకురాలయిన మధురిక ప్రవేశించుచున్నది.]

సమా—(సమీపించి) సఖీ! ఉద్యానవనవ్యాపారమునందు నీవు సుఖముగా నున్నావా?

మధు—ఓహోహో! సమాహితికవా? సఖీ! నీకు స్వాగతము.

సమా—ఓసీ! "నావంటివారు రాజుగారిని రిక్తహస్తములతోఁ బోయి చూడఁ గూడదు గనుక, దర్శనము చేయఁగోరు నా

కొక నిమ్మపండు కావలసి యున్నది." అని పూజ్యురా లయిన పరివ్రాజిక నీ కానతిచ్చుచున్నది.

మధు—ఇదిగో నిమ్మపండు సమీపమునసే యున్నది. కాని, పరస్పర వివాదము లాడుచున్న నాట్యాచారుల యుపదేశమును జూచి, ఆ పూజ్యురా లెవరిని మెచ్చినదో చెప్పు.

సమా—ఇద్దఱును పాండిత్యమును బ్రయోగనైపుణ్యమును గలవారే. అయినను శిష్యురాలి గుణవిశేషముచేత గణదాసుఁడే యధికుఁ డని చెప్పఁబడినాఁడు.

మధు—అటుతరువాత మాళవికవిషయ మయిన రహస్య వ్యాపారమును నీ వేమయిన విన్నావా?

సమా—రాజామెయందు గాఢానురాగము కలవాఁడై యున్నాఁడు. కాని కేవలము ధారణీదేవియొక్క మనస్సునొప్పించుట కిష్టములేక తన ప్రభుత్వమును గనఁబఱుపకున్నాఁడు. ఈదినముల యందు వాడిపోయిన మాలతీమాలవలెనే మాళవికయు శోషిల్లి కనఁబడుచున్నది. అంతకంటె నాకుఁ దెలియదు. నన్ను విడిచిపెట్టుము.

మధు—ఈకొమ్మయందు వ్రేలాడుచున్న నిమ్మపండు తీసికొని పొమ్ము.

సమా—(కోసికొన్నట్టభినయించుచు) సఖీ! ఈసాధుజన శుశ్రూషచేత నీ వింతకంటెను మంచిఫలమును బొందుము.

(అని బయలుదేఱుచున్నది.)

మధు—సఖీ! మనము కలిసిపోవుదము. నేనుగూడవచ్చి చిరకాలమునుండి పూఁతపట్టకున్న యీకాంచనాశోకవృక్షమునకు

దోహదము చేయించునిమిత్తమయి దేవిగారితో మనవి చేసెదను.

సమా—అవును, అది నీపనియే కదా?

(అని యిద్దఱును బోవుచున్నారు.)

ఇది ప్రవేశకము

[అప్పుడు కామావస్థలో నున్నరాజును విదూషకుఁడును ప్రవేశించుచున్నారు.]

రాజు—(తన్నుఁ జూచుకొని)

ఉ. కాయము చిక్కఁజెల్లు నలకామినికౌఁగిలిసౌఖ్య మబ్బమిన్;
బాయక కన్ను నీరు విడువంగనగుఁ క్షణమేని చూడమిన్;
దోయజనేత్రి నించుకయుఁ ద్రోచితొలంగనియట్టి నీవు న
త్యాయతతాప మొందెదవహో యిదియేమిటి కిందు? డెందమా!

విదూ—మీరు ధైర్యమువిడిచి దుఃఖించుట యింతటితో జాలును. నేను మాళవికకు బ్రియసఖి యైనవకుళావళికను జూచి దేవరవారిసందేశమును జెప్పినాను.

రాజు—అప్పు డది యేమున్నది?

విదూ—"ఈయాజ్ఞచేత నేను కృతార్థురాల నయినాను. అయినను భాగ్యహీనురా లయినయామె నిప్పుడు నిధిని రక్షించునట్లుగా దేవిగారు మఱింత పదిలముగాఁ గావలియుంచి కాపాడుచున్నారు గనుక, ఆమెవద్దకుఁ బోవుటయే సుఖసాధ్యము కాకున్నది. అట్లయ్యును నేను బ్రియత్నము చేసెద నని రాజుగారితో విన్నవింపుము" అన్నది.

రాజు—ఓ దేవా! ఓ సంకల్పసంభవా! ప్రతిబంధములతో

నిండిన విషయముల యందుఁ బ్రవేశ పెట్టి, నన్ను క్షణకాలమైన సహింప శక్యముకానట్లుగాఁ గొట్టుచున్నావు. (విస్మయముతో)

గీ. పరమకోమలమగు నీము బాణమేడ?
హృదయభేదక మగు పీడయేడ? మదన!
మృదువుఁ దీక్ష్ణంబు నగుసన్న మేటివింత
వసుధ నీయందుఁ గానంగఁబడెడు నేడు.

విదూ—ఈ కార్యసాధన విషయమయి నేనొక యుపాయ ప్రయోగము చేసినా నని దేవరకు విన్నవించుచున్నాను. కనుక నీమనస్సు దృఢముగా నుంచుకొమ్ము.

రాజు—ఓయీ! ఉచితవ్యాపారములయందు విముఖమయి యున్న యీ హృదయముతో నేనీ దినశేష మెక్కడఁ గడవుదును?

విదూ—క్రొత్తగాఁ బూచిన మనోహరములయిన రక్తకురు వకపుష్పములను గానుకగాఁ బంపి, ఈయభినవ వసంతసమయము నందు దేవరవారితోఁగూడ డోలాధిరోహణసుఖ మనుభవింప మనసుపడుచున్నానని యిరావతి యిప్పుడేనిపుణికచేతఁ దమకు సమాచారము పంపినదిగదా? దేవరవారును అందు కొప్పుకొన్నారుగనుక మన మా ప్రమదవనమునకే పోదము.

రాజు—అది సరిపడదు.

విదూ—ఎందు చేత?

రాజు—మిత్రుడా! స్త్రీలు సహజముగా బుద్ధికౌశలము కలవారు. నేను బయి కెంతలాలనము చేయుచున్నను నామనస్సు మఱియొకతెయందుఁ దగిలియున్నసంగతి నీసఖ యెట్లు కనిపెట్టకుండును?

ఉ. నెయ్యము త్రెంప హేతువు లనేకము కూర్పఁగవచ్చుఁగాన, నే
నియ్యెడ మానుటర్హ మగు నిప్పు డిరావతియొద్ది కూరిమిన్,

నెయ్యము లేనిచో హృదిని, నేర్పునఁ బూర్వము కంటె హెచ్చుగాఁ
జయ్యనఁ జేయు సేవ యుపచారము కాదు వివేకురాండ్రికిన్.

విదూ—దేవర యంతఃపుర కాంతలమీఁది దాక్షిణ్యము నొక్కసారిగా వెనుక పట్టించుట తగదు.

రాజు—(ఆలోచించి) అట్లయినచోఁ బ్రమదవనమార్గము కనఁబఱుపుము.

రాజు—దేవా! ఇదె యిదె.

(ఇద్దఱును నడచుచున్నారు.)

విదూ—ఈప్రమదవనము వాయుబలముచేతఁ గదలుచున్న చిగురుటాకులను వేళ్ళతో దేవరవారిని ప్రవేశింపఁ ద్వరపెట్టుచున్నట్లున్నది.

రాజు—(స్పర్శసుఖముకనఁబఱిచి) వసంతము వచ్చినదికదా! మిత్రుఁడా! చూడు.

చ. కడసిన గండుఁగోయిలల కర్ణసుఖావహ కూజితంబుచే
సదయతఁ గాముబాధ కెటు సైపుమటం చనునట్టు లొప్పెడున్;
పదిగ వసంతుఁ డామ్రముసువాసనలం దగు చల్లగాలిచే
మృదువగుచేతితో నిమురురీతిని దోఁచెడు మచ్ఛరీరమున్.

విదూ—తాపోపశమనము కలుగుట కయి యిందుఁ బ్రవేశింపుము. (ఇద్దఱును ప్రవేశించుచున్నారు.)

విదూ—అవధానముతోఁ జూడుము. ఇదిగో ప్రమదవనలక్ష్మి నిన్నాకర్షించుటకో యనునట్లు యువతీవేషమును లజ్జపఱుచు పుష్పాలంకారము ధరించి యున్నది.

రాజు—నేనును విస్మయముతోనే చూచుచున్నాను.

సీ. బింబాధరాలక్తకంబును మించెడు
నసమరక్తాశోకకుసుమవితతి
మకరికాపత్రాది మండనంబును మించు
నరుణశుభ్రవినీలకురవకాళి
చంచరీకసమాశ్రయాంచిత తిలపుష్పగరిమ
మించును దిలకంబుఁగూడ
బహువిధశృంగార భావంబులనుమించి
వింతగానున్న వసంతలక్ష్మి
ప్రౌఢయువతీజనంబుల రమ్యమైన
మోములను జేయు సింగారములను మించి
వానికి నవజ్ఞ చేసెడువరుస నిదిగొ
వఱలుచున్నది నేత్రోత్సవంబుగాఁగ.

(అని యుద్యానశోభను నిరూపించుచున్నారు.)

[అప్పుడు సంభ్రమముతో మాళవిక ప్రవేశించు చున్నది.]

మాళ—రాజుమనసు తెలియక నేనాయనను గామించుచున్నందుకు లజ్జపడుచున్నాను. నేనీవృత్తాంతమును నాప్రియసఖకెట్లు చెప్పఁగలను? మన్మథుఁడు నాకీ యప్రతీకారమైనతీవ్రవేదన నెంతకాలము పెట్టునో తెలియఁజాలకున్నాను. (కొన్నియడుగులు నడిచి) నేనెక్కడకు బయలుదేఱినాను? (ఆలోచించి) "గౌతముని చపలత్వముచేత నుయ్యేలనుండి పడి నాకాలు నొప్పిపట్టి యున్నది. అందుచేత నేను బోవుటకశక్తురాలనుగా నున్నాను. కాఁబట్టి నీవు పోయి కాంచనాశోకమునకు దోహదము నిర్వర్తింపుము. అది యైదురాత్రులలోపలఁ బూఁతపట్టినపక్షమున, నీమనోరథపూర్వకమయినయనుగ్రహమును నీకుఁ జేసెదను." అని దేవిగారు నన్నుఁ

బంపి యున్నారు. నేనిప్పుడు నియమించినస్థలమునకు వచ్చియున్నాను. నాపాదాలంకారమును బట్టుకొని నావెంటనే బయలుదేఱిన వకుళావళిక యింకను రాకున్నది. నే నీలోపల ముహూర్తకాల మొంటిగా దుఃఖపడియెదను. (అని యిటునటు తిరుగుచున్నది.)

విదూ—(చూచి) అహాహా! ఇదిగో మద్యపానవిహ్వలుఁడై యున్నవానియొద్దకుఁ బాసకవుఁగుండ తీసికొని రాఁబడినది!

రాజు—ఓయీ! అది యేమి?

విదూ—అదిగో మాళవిక విశేషాభరణములు లేకముఖమునందు విచారము కన్పడ నొంటిగా సమీపముననే నిలిచి యున్నది.

రాజు—(సంతోషముతో) ఏమీ! మాళవికా?

విదూ—నిస్సందేహముగా.

రాజు—ఇప్పుడు నాకుఁ బ్రాణములు నిలుపుకొనుటకు శక్యమగును.

చ. దగగొనియున్న పాంథుఁడటుతన్ విని సారసపక్షికూఁత, దా
నొగిఁ దరువాటిక్రేవ నది యున్నదటం చలరారుమాడ్కి, మే
లగుప్రియురాలు చెంతఁ గలదంచును నీవు వచింపఁ జింతచేఁ
బొగిలెడు నాదుడెందమును బొందెడు నిందు నమందమోదమున్.

ఆమె యెక్కడ?

విదూ—అదిగో చెట్లచాలునడుమనుండి వెలువడియీవంకకే మరలి కనఁబడు చున్నది.

రాజు—ఆమెను జూచినాను.

గీ. ఘననితంబము నిఱుపేద కౌనుఁ గలిగి
బటువు లైనట్టి గబ్బిగుబ్బలను దనరి

నిడుదలౌ వాలుఁగన్నులు నెఱయ నిటకె
చేరవచ్చెడు నదిగో నాజీవితంబు.

మిత్రుఁడా! ఆమె పూర్వముకంటెఁ గ్రొత్తయవస్థ పొంది యున్నది. ఎట్లన—

గీ. రెల్లుపువుఁబోలెఁ జెక్కులు తెల్లపాఱి
పరిమితము లైనభూషణావళులఁ దాల్చి
వఱలెడు వసంతమునఁ బాండుపత్రవితతి
మూఁగఁ బూఁతపట్టెడు మల్లెతీఁగెఁ బోలి,

విదూ—ఈమెయు నీవలెనే మన్మథవ్యాధిచేత నేబాధనొందు చుండి యుండును.

రాజు—నామీఁదిప్రేమచేత నీక ట్లగపడుచున్నది.

మాళ—ఈవృక్షమును లలితసుకుమారదోహదము నపేక్షించి పుష్పాలంకారము లేక యత్యాతుర నయి యున్ననావలెనే శోక మనుభవించుచున్న ట్లున్నది. కాఁబట్టి దీనినీడచేతఁ జల్లఁగా నున్న యీరాతిమీఁదఁ గూరుచుండి వేడుకతోఁ బ్రొద్దు పుచ్చెదను.

విదూ—ఆమె యత్యాతుర నయి యున్నానని చెప్పుచున్నది విన్నావా?

రాజు—ఇంతమాత్రముచేత నీయూహ సరియైన దని నే నెంచను. ఎందుచేత నన—

క. కురువకసుమరజముం గొని,
వరశీకరముల ధరించి, వంచి చిగుళ్ళన్,
దరుణుల నిష్కారణముగ
మరి యాతురపెట్టవచ్చు మలయానిలుఁడుౕ!

మాళ—(కూరుచున్నది)

రాజు—మిత్రుఁడా! మన మీతీఁగెలచాటున దాఁగియుందము రమ్ము.

విదూ—దూరమున యిరావతివలెఁ గనఁబడుచున్నది!

రాజు—పద్మలతను జూచినయేనుఁగు మొసలిని లక్ష్యము చేయదు. (అని చూచుచున్నాఁడు)

మాళ—ఓహృదయమా! నేను నిరాధారను గనుక దుర్లభమైన యీకోరికను విడువుము. నన్నేల నీవాయాస పెట్టెదవు?

విదూ—(రాజువంకఁ జూచుచున్నాఁడు)

రాజు—ప్రేమయొక్కమహిమ చూడుము.

గీ. పలుకవునిమిత్త మామనోవ్యధకు నీవు,
తత్త్వమరయంగ నూహకుఁ దరముకాదు;
లలనరో! యట్లయిన నీవిలాపమునకుఁ
గారణము నేనయంచు నిక్కముగఁ దలఁతు.

విదూ—దేవా! ఇప్పుడే మీసంశయము నివర్తియగును. నేను మీమదనసందేశమును జెప్పినవకుళావళిక యొంటిగా నీలాగున వచ్చుచున్నది.

రాజు—అది నాప్రార్థన మఱచిపోయినదేమో!

విదూ—ఇప్పుడాబానిసకూఁతురు మహత్తరమయిన దేవర వారి సందేశము నేలమఱచును?

[పాదాలంకారములతో వకుళావళిక ప్రవేశించుచున్నది]

వకు—నాసఖికి క్షేమమా?

మాళ—ఓహో! వకుళావళికా! వచ్చితివా? నీకుస్వాగతము. కూరుచుండుము.

వకు—(కూరుచుండి) ఓసీ! నీవిప్పుడు యోగ్యమయిన పనికి నియమింపఁబడినావు. నీకాలొకటి నావంకఁజూపుము. లత్తుక పెట్టి నూపురము తొడిగెదను.

మాళ—(తనలో) ఓహృదయమా! యీవైభవములభించినదని సంతోషింపఁబోకుము. నాకీదుర్దశ యెట్లుతొలఁగును? కానిమ్ము నాకిదే మరణాలంకారముకాఁగలదు.

వకు—నీలో నీవేమియాలోచించుచున్నావు? దేవిగారీకాంచనాశోక మెప్పుడు పుష్పించునాయని యాతుర పడుచుండురుగదా?

రాజు—ఏమీ! ఈప్రయత్నమంతయు నశోకవృక్షదోహదమునిమిత్తమా?

విదూ—ఏమి? దేవిగారు కారణములేక యీయంతఃపురాభరణముతో నీమె నలంకరింప నియమించియుండ దని మీకుఁ దెలియదా?

మాళ—(కాలుచాఁచి) సఖీ! ఇప్పుడు కాలికి నొప్పికలుగనీకుము.

వకు—సఖీ! నీవు నాశరీరమవేకదా?

(అని పాదాలంకారము చేయునట్లు నటించుచున్నది)

రాజు—గీ. సఖుఁడ! చూడుము ప్రియురాలిచరణమునకు
లేఁతగానిడ్డ లత్తుకలేఖ యదిగొ
హరునిచే దగ్ధమైన యనంగవృక్ష
మునకుఁ దొల్లిపల్లవం బన మురువుచూపు.

విదూ—దేవిగారీమెకు నియమించినపని యీపాదమునకుఁ దగియున్నది.

రాజు—నీవు చక్కఁగాఁ జెప్పినావు.

చ. పరసఖకాంతినొప్పి నవపల్లవరాగముచేత నార్ద్రిమా
తరుణిప్రశ స్తపాదమునఁ దన్నఁగవచ్చును రెంటి నింకఁ; గ్రొ
వ్విరు లవిలేక దోహదము వేఁడునశోకమునైన; లేనిచో,
శిరమునువంచి నేరమును జేసినకాంతునినైన, మిత్రుఁడా!

విదూ—నీవే యీమెయెడ నేరముచేసినవాఁడవగుదువేమో.

రాజు—అమోఘకార్యసిద్ధుఁడవగు నీబ్రాహ్మణ వాక్యమును శిరసా వహించెదను.

[అప్పుడు మత్తుగొనియున్న యిరావతి చేటికతోఁగూడ
ప్రవేశించుచున్నది]

ఇరా—సఖీ! నిపుణికా! స్త్రీలకిటువంటిమత్తత విశేషాలంకార మని నేను బలుమాఱు వినుచువచ్చినాను. ఈలోకోక్తి సత్యమేనా?

నిపు—ఇది మొదట లోకప్రవాదమేకాని యిప్పుడు సత్యమే యయినది.

ఇరా—ఓసీ! నాయందలిప్రేమ నటుండనిమ్ము. ఉయ్యెల యున్నగృహమునకు భర్త నాకంటెముందుగాఁ బోయియుండునని నీవిప్పుడెట్లు తెలిసికొంటివో నాకుఁజెప్పు.

నిపు—అమ్మా! నీయందలి యఖండప్రేమచేతఁ బోయియుండు నని తెలిసికొంటిని.

ఇరా—ఈయుపచారవృత్తి చాలించి, మధ్యస్థతను వహించి చెప్పుము.

నిపు—వసంతోత్సవమునందలి నైవేద్యములను మరగినగౌతముఁడు నాతోఁ జెప్పినాఁడు. అమ్మగారు త్వరపడవలెను.

ఇరా—(అవస్థకు తగినట్టుగాకొంచెమునడిచి) సఖీ! మత్తుచేత

బాధపడుచున్న నన్ను రాజుగారి దర్శనమునిమిత్తము చిత్తము త్వర పెట్టుచున్నది కాని కాళ్ళుమాత్రము సాగకున్నవి.

నిపు—మనమిప్పు డుయ్యెలయున్నవసంతగృహమునకు వచ్చియున్నారము.

ఇరా—నిపుణికా! భర్తగా రిక్కడఁ గనఁబడరే.

నిపు—అమ్మగారు తిన్నఁగాఁజూడవలెను. పరిహాసార్థముగా రాజుగారిం దేతీఁగెలలోనో గూఢముగా దాఁగియుండురు. మనమును బ్రేంకణపులతాపరివృత మయిన యీయశోకవృక్షముక్రిందిశిలాపట్టమునకుఁ బోవుదము.

ఇరా—అలాగే.

నిపు—(చూచి) అమ్మా! చూడుము. క్రొమ్మావిగున్నను వెదకుచున్న మన కిప్పు డెఱ్ఱచీమ కానఁబడుచున్నది.

ఇరా—అది యేమి?

నిపు—ఇదిగో యశోకవృక్షముయొక్క నీడను వకుళావళిక మాళవికకుఁ జరణాలంకారము చేయుచున్నది.

ఇరా—(శంకను గనఁబఱిచి) ఇది మాళవిక యుండవలసిన చోటు కాదు. నీవేమని యూహించెదవు?

నిపు—ఉయ్యెలనుండి పడుటచేతఁ గాలునొప్పి పెట్టిన దయి దేవిగా రశోకదోహదకార్యమునకు మాళవికను నియోగించి రని యూహించెదను. అట్లు కానియెడల దేవి తాను ధరించుకొనెడి యీ యందెలజతను బరిజనము పెట్టుకొనుట కెట్లు నియమించును?

ఇరా—ఇది దీనికి గొప్పగౌరవము.

నిపు—నీవు రాజుగారి నేల వెదకవు?

ఇరా—సఖీ! నాపాదములు ముందుకు నడువకున్నవి; నా

మనస్సు కళవళపడుచున్నది. ఈలోపల నాజంకు దీర్చుకొనియెదను. (అని మాళవికను జూచి తనలో) నామనస్సులో భీతి కలుగుటకు హేతువు లేకపోలేదు గదా!

వకు—(పాదమును జూచి) ఏమి? ఈలత్తుక రేఖలనుదీర్చుట నీ కింపుగా నున్నదా?

మాళ—నా కాలిమీఁద నుండుటచే దీనిని నేను బ్రశంసించుటకు లజ్జపడుచున్నాను. ఈ శిల్పకళాకౌశలమును నీవెవరివద్ద నేర్చుకొన్నావు?

వకు—నే నిప్పుడు రాజుగారి శిష్యురాలను.

విదూ—నీ విప్పుడు గురుదక్షిణ పొందుటకు వేగిరమురమ్ము.

మాళ—అదృష్టవంతురాల నని గర్వపడఁబోకు.

వకు—ఉపదేశమునకుఁ దగినపాదము లభించినది గనుక నే నిప్పుడు గర్వమునే పొందెదను. (లత్తుకరచనను చూచి తనలో) నాపని నేను జక్కఁగా నిర్వహించితిని. (ప్రకాశముగా) సఖీ! నీ పాదమున కొకదానికి లత్తుకపెట్టుట యయినది. ఇఁక నోటితో నూఁది తడి యార్చవలెను. అక్కఱలేదు. ఆపని యిక్కడిగాలియే చేయుచున్నది.

రాజు—మిత్రుఁడా! చూడుచూడు.

గీ. పచ్చిలత్తుకచేఁ దడిపాయకున్న
పాద మా అంగ నాముఖవాయువునను
జక్కఁగానూఁది తగుసేవ సలుప నాకు
నుత్తమంబైన యవకాశ మొదవె నిపుడు.

విదూ—మీ కీచింత యెందుకు? ఈసేవ మీకు చిరకాల మనుభవింప లభించును లెండి.

వసు—సఖీ! నీపాదము కెందామరవలె శోభిల్లు చున్నది. నీ విప్పుడు సర్వదా రాజుగారియొడిలోఁ జేరుదానివలె నున్నావు.

ఇరా—(వసులావళికముఖము కేసి చూచు చున్నది.)

రాజు—ఇది నాకాశీర్వాదము.

మాళ—ఓసీ! అవినయవాక్యములు పలుకకు.

వసు—నేను బలుకఁదగినదానినే పలికితిని.

మాళ—అట్లయిన, నేను నీకుఁ బ్రియురాలనుగానా?

వసు—నాకు మాత్రమే కాదు.

మాళ—మఱియెవరికిఁగూడ?

వసు—గుణగ్రాహులయిన రాజుగారికిఁగూడ!

మాళ—నీవు మాయమాటలు చెప్పుచున్నావు నాయందట్టి గుణ మేదియు లేదు.

వసు—సత్యము. నీయందుఁ గాదు. నాకది కృశించి తెల్లవాఱిన రాజుగారి సుందరాంగములయందుఁ గనఁబడు చున్నది.

నిపు—మొదట గుణించుకొని వచ్చినట్లే యీచెడుపడఁతుక యుత్తరము చెప్పుచున్నది!

వసు—అనురాగ మనురాగముచేతనే పరీక్షింపఁ దగిన దన్న సుజనవాక్యమును బ్రమాణము చేసికొమ్ము.

మాళ—నీ వేల యిచ్చవచ్చిన ట్లెల్లను వదరెదవు?

వసు—కాదు కాదు. ప్రేమచేత మృదువులయిన యివి మఱి యొకరి నోటినుండి వచ్చిన రాజుగారి వాక్యములే సుమా?

మాళ—సఖీ! దేవిని దలఁచుకొని నా హృదయ మీమాటలను విశ్వసింపకున్నది.

వసు—ఓసిముద్దరాలా! తుమ్మెదబాధ యున్న దని వసంత

కాలమునఁ గలిగినకొ౯్రొమ్మావిపూ వలంకరించుకోఁ గూడదాయేమి?

మాళ—దుర్లభపదార్థాపేక్ష పొందియున్న నాకు నీవు సహాయురాల వగుదువా?

వకు—నేను మర్దించినకొలఁదిని బరిమళించు వకుళావళికను జుమా.

రాజు—మేలు! వకుళావళికా! మేలు!

ఉ. భావమెఱుంగనై నపిదపం దగఁ బ్రస్తుతవాక్యయుంబులన్.
కేవలముం దిరస్కృతి జనించినచో నుచితోత్తరంబులన్,
జేవమెయి నివేదనము చేసె మదీయునిదేశ మిచ్చటన్;
జీవములిట్లు దూతికలచేతనె యుండును గాముకాళికిన్.

ఇరా—సఖీ! వకుళావళిక మాళవికచేత నీకార్యమునం దడుగుపెట్టించినది చూచితివా?

నిపు—అమ్మా! నిర్వికారుల కయినను సమయోచితమైన యుపదేశము వాంఛను బుట్టించును.

ఇరా—నాహృదయమునకు యొక్క శంక తప్పక పొందవలసిన దే. ఇప్పుడు సంగతి తెలిసినందునఁ గర్తవ్య మాలోచించెదను.

వకు—ఇదిగో నీరెండవపాదముకూడ నలంకరింపఁబడినది. ఇప్పుడందెలను నీ రెండుకాళ్ళకును దొడిగెదను. (అందెలు పెట్టుటనభినయించుచున్నది.) సఖీ! లెమ్ము. అశోకమును పుష్పింపఁజేయుటకయియుఁక దేవిగారియాజ్ఞ నడుపుము. (ఇద్దఱును లేచుచున్నారు.)

ఇరా—దేవిగారి నియోగమని విన్నాను. ఇప్పుడది జరగనిమ్ము.

వకు—ఇదిగో రాగాధిక్యము గల నీవనుభవింపఁదగిన వాని రూపము నీయెదుటనే యున్నదే.

మాళ—(సంతోషముతో) భర్తా యేమి ?

వకు—(చిఱునవ్వుతో) భర్త కాఁడు. ఈయశోకమున వ్రేలుచున్నయీక్రొంజిగురుజొంపములను కర్ణాభరణముగాఁ జేసికొమ్ము.

మాళ—(విషాదమును నటించుచున్నది.)

విదూ—ఏమి? దేవరవారు విన్నారా ?

రాజు—మిత్రుఁడా ! ఇంతతోనే కాముకుల యభీష్టము సంపూర్ణ మగును.

చ. ఒకరికిఁ బ్రేమ యుండి మఱియొక్కరికిం దగుప్రేమ లేనివా
రికి వడిఁ బొందు కల్గినను శ్రేష్ఠము కాదది; యంతకంటెనున్
బ్రకటసమానురా లగువారల కామరణంబు నొండొరుల్
వికలతఁగూడ నబ్బమియుఁ బెద్దయు మేలుగ నెంతు నామదిన్.

మాళ—(చిగురాకును గర్ణాభరణముగా ధరించికొని విలాపముతో నశోకమును దన్నుటకుఁ బాద మెత్తుచున్నది.)

రాజు—మిత్రుఁడా !

గీ. పాదపమునుండి గ్రహియించి పల్లవంబు
మరలఁ బాదపల్లవ మిడె ప్రమాఁకునకును;
కోరి యుభయులు నిటు మార్చుకొనుటచేత
వంచితుఁడ నైతి నిప్పు డేనంచుఁ దలఁతు.

మాళ—ఈయశోకముపూచుటకయి చేయవలసిన దోహదము నేను జేసితినిగదా! ఇట్లు చేసినతరువాతఁగూడ నిది పుష్పించకుండునేమో?

వకు—సఖీ! ఇఁక నీలోప మేదియు లేదు. నీచరణసత్కారము నొందియు శీఘ్రముగాఁ బూఁత పట్టకపోయినపక్షమున నీ యశోకవృక్షమే నిర్గుణ మగును.

రాజు—

ఉ. ఈతనుమధ్యయందియుల నింపగునాదము పుట్టఁగా నవా
బ్జాతసమానకోమలపాదమున న్నిను సత్కరించినం
బూఁతనుబట్టకున్న, నిటఁబొల్చి యశోకము! చారురూపశో
భాతులనాయకార్హ్వ మగునాదరమున్ వృథగాదె నీయెడన్.

మిత్రుఁడా! నేనుబోయి యవకాశము చేసికొని మాటాడఁ గోరుచున్నాను.

విదూ—రమ్ము. నేనిప్పుడు వారిని భయపెట్టెదను.

(ఇద్దఱును నిష్క్రమించు చున్నారు.)

నిపు—అమ్మా! అమ్మా! రాజుగారు ప్రవేశించు చున్నారు.

ఇరా—నేనిది మనస్సులో మొదటనే యాలోచించినాను.

విదూ—(చేరఁబోయి) అమ్మా! రాజుగా రెదుట నుండఁగా దేవిగారికిఁ బ్రియమయిన యీయశోకవృక్షమును ఎడమకాలితోఁ దన్నుట నీకుఁ దగునా?

ఇద్దఱు—(తొట్రుపాటుతో) అయ్యో! రాజుగా రిక్కడనే యున్నారే!

విదూ—వకుళావళికా! ఈమె తెలియక యవినయకార్యము చేయుచుండఁ దెలిసినదానవు నీవు దాపుననుండి యెందుకు వారించి నావు కావు?

మాళ—(భయము కనఁబఱుచు చున్నది.)

నిపు—అమ్మా! మహానుభావుఁ డైనయీగౌతముఁ డేమి చేయుచున్నాఁడో చూడు.

ఇరా—ఇట్లు కాకపోయిన మఱియెట్లీబ్రాహ్మణాధముఁడు జీవనము చేయఁగలుగును?

వకు—అయ్యా! ఈమె దేవిగారియాజ్ఞాప్రకారమే చేయుచున్నది. ఈయతిక్రమమునం దీమె పరాధీనురాలు. రాజుగారు క్షమింతురుగాక! (అని తాను మ్రొక్కి మాళవికచేత మ్రొక్కించుచున్నది)

రాజు—అట్లయిన పక్షమున నీయందుఁ దప్పిదము లేదు. కళ్యాణీ! లెమ్ము. (అని చేతితోఁ బట్టుకొని మాళవికను లేవఁదీయుచున్నాఁడు)

విదూ—ఇది తగును. దేవిగారు మాననీయురాలుగదా?

రాజు—క. జవ్వనిరో! కఠినంబగు

నివ్వసుధారుహము మొదల నిటు మోపుటచే

నొవ్వదె కిసలయకోమల

మిచ్ఛావమపదాంబుజాత మిప్పుడు నీకున్ ?

మాళ—(లజ్జ నభినయించుచున్నది)

ఇరా—(అసూయతో) ఓహో! భర్తగారు నవనీతకోమలహృదయులుగదా!

మాళ—వకుళావళికా! తమ నియోగమును నడిపితి మని దేవిగారికి నివేదింతము రమ్ము.

వకు—సెలవు పుచ్చుకొనియెద నని రాజుగారికి విన్నపము చేయుము.

రాజు—కళ్యాణీ! నీవు పోవచ్చును. సమయము దొరికినది గనుక ముందుగా నీవిప్పుడు నా ప్రార్థనను వినుము.

వకు—అవహితురాల నయి వినుము— దేవర వా రానతిత్తురుగాక!

రాజు—గీ. ఈవిధమున నె యింతిరో! యీశరీర
మల రోదవకుండఁ జిర కాల మంచునుండి;
నీదు స్పర్శామృతంబున నెఱపు మిందు
నన్య మొల్లనినాకు దోహదము నిపుడు.

ఇరా—(వేగముగా సమీపించి) ఈయన కవశ్యముగా దోహదము చేయుము. అశోకము పూలనుమాత్రమే యిచ్చునుగాని యీయన పూవులను ఫలములనుగూడ నిచ్చును.

[అందఱును ఇరావతినిజూచి తత్తఱపడుచున్నారు]

రాజు—(రహస్యముగా) మిత్రుఁడా! ఇప్పు డేమిగతి?

విదూ—మఱి యేమున్నది? పిక్కబలమే.

ఇరా—మేలు! వకుళావళికా! మేలు! ఇప్పుడు నీవు మంచి పనికిఁ బూనుకొన్నావు. మాళవికా! భర్తగారికోరికను సఫలము చేయుము.

ఇద్దఱు—అమ్మా! క్షమింపుము, రాజుగారి ప్రణయపరిగ్రహణమునకు మే మెవరము? (అని వెడలిపోవుచున్నారు)

ఇరా—పురుషులను నమ్మఁగూడదు. నీ మాయామాటలు నమ్ముటచేతఁ బ్రియభార్య నయియుండి తిరస్కృతురాల నయిన నా కిప్పు డిది హృదయశల్య మయినది. వేటకాని గీతముచేత ననుమానపడక యాకర్షింపఁబడిన లేడివలెనే నా వినాశము నేను దెలిసికొనలేకపోతిని.

విదూ—(రహస్యముగా) మిత్రుఁడా! ఏదో యుత్తరము నాలోచింపుము. నీకుఁ జెప్పవలసిన దేమున్నది? నీటిసమీపమున దారిలేక పట్టుపడిన దొంగవలెనే యిప్పుడు సంధి చేసికొనుటయే కర్తవ్యమని తోఁచుచున్నది.

రాజు—సుందరీ! నాకు మాళవికతోఁ గొంచెమయినను బని లేదు. నీ వాలస్యము చేసినందున, వీరితో నేను గొంచెము వినోదముగాఁ బ్రొద్దుపుచ్చుచున్నాను.

ఇరా—మిమ్ము నమ్మఁగూడదు. భర్తగారి కిటువంటి వినోదము దొరకినసంగతి నాఁకుఁ దెలిసినది కాదు. అట్లు తెలిసియుండిన యెడల నే నీవిధముగా మీకు వినోదభంగమును జేసి యుండను.

విదూ—ఇప్పుడు రాజుగారి దాక్షిణ్యము చెడఁగొట్టుకోకుము. సమీపమునఁ గనఁబడినప్పుడు రాణిగారి పరిచారికలతోడ సంభాషించుట కూడఁ దప్పగునా? నీవే చెప్పు.

ఇరా—వారితోడి సంభాషణమే జరగనిమ్ము. నేను నా మనస్సు నేల యాయాస పెట్టుకోవలెను?

(అని రోషముతో బయలు దేఱుచున్నది.)

రాజు—(వెంబడించి) ప్రాణేశ్వరీ! శాంతింపుము.

ఇరా—(ఒడ్డాణమూడి కాలికిఁ దగులుకొనఁగా నడుచుచున్నది.)

రాజు—సుందరీ! ప్రేమగలవారిని నిరాదరించుట యుక్తము కాదు.

ఇరా—ధూర్తా! నీవు నమ్మఁదగినవాఁడవు కావు.

రాజు—గీ. 'ధూర్తా' యనుమాటతోనె యోతోయజాక్షి!
యనుఁగున్నైన నాపయి కోప మాఱఁజెల్లు;
కాళ్ళపయివ్రాలి నిన్ను మేఖలయు వేఁడఁ
జండి! కోపంబు విడువంగఁ జాలవేమి?

ఇరా—ఈ చెడు మేఖలయు నిన్నే యనుసరించుచున్నది.
(అని మొలనూలుపుచ్చుకొని దానితో రాజును గొట్టఁబోవుచున్నది.)

రాజు—మిత్రుఁడా! ఈ యిరావతి

గీ. కౌనునుండి యుపేక్షతోఁ గరముజారు
పసిఁడి మొలనూలితోడ శాప్పములు కాలి
నుగ్రిరాలయి నన్నుఁ గొట్ట నుద్యమించె
మొయిలు మెఱుముతో వింధ్యాద్రి మోఁదునట్లు.

ఇరా—ఏమి? ఈవిధముగా నన్ను మరలఁ దిరస్కారము చేయుచున్నావు. (అని మొలనూలితోడి చేయి తీసుకొనుచున్నది.)

రాజు—క. అపరాధినైన నాపయి
నిపుడెత్తినదండ ముడిపెదేల? లతాంగీ!
యిపుడు విలాసము పెంచియుఁ
గుపితత్వము దాసునందుఁ గూర్పెద వకటా.

ఇప్పుడు నీకోపము తగ్గింపుము.

(అని పాదములమీఁదఁ బడుచున్నాడు.)

ఇరా—నీకు సంతోషకర మయిన దోహదము చేయుటకివి మాళవిక పాదములు కావు.

(అని చేటికతోఁగూడఁ బోవుచున్నది.)

విదూ—లెమ్ము. నీ వనుగ్రహింపఁ బడినావు.

రాజు—(లేచి యిరావతిని గానక) ఓహో! నాప్రియురాలు వెడలిపోయినదా?

విదూ—మిత్రుఁడా! దైవవశముచేత నవినయుఁడవైన నిన్నిప్పుడు విడిచిపోయినను దానికోపమింకను దీఱలేదు. అంగారరాశివలె నీమె మరల రాకమునుపే మనము శీఘ్రముగాఁ బాఱిపోవుదము రమ్ము.

రాజు—ఆహా! కాముని వైపరీత్యము!

గీ. మనసు ప్రియురాలిపైఁ జిక్కుకొనిన నేను
సేవకని యెంతొ మ్రొక్కినఁ జేకొనమియు;
కూర్మిగలదయ్యు నామీఁదఁ గుపితయగుట
చేత నేను నిప్పు డుపేక్ష చేయవచ్చు.

(అందఱును నిష్క్రమించుచున్నారు)

చతుర్థాంకము

[అప్పుడు విచారగ్రస్తుఁడయి రాజును, ప్రతీహారయుఁ బ్రవేశించుచున్నారు]

రాజు—(తనలో)

చ. చెవులనుబడ్డ కాంతపయిఁ జేకును వేదది నాటి యాశచే,
నవలను రాగపల్లవము నందుచు దృష్టికిఁ గానిపించుటం,
దవిలి కరంబు పూచినవిధంబమరం బులకాంకురాళిచే,
జవమునఁ గామవృక్షము రసజ్ఞుని నక్ ఫలమొందఁ జేయుతన్.

(ప్రకాశముగా) మిత్రుఁడా! గౌతమా!

ప్రతీ—దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! గౌతము డిక్కడ లేఁడు.

రాజు—(తనలో) అయ్యో! అతఁడు మాళవిక వృత్తాంతమును దెలిసికొనివచ్చుటకయి నాచేతఁ బంపఁబడినాఁడుగదా!

[విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

విదూ—మీకు జయమగుఁగాక! జయమగుఁగాక!

రాజు—జయసేనా! ధారణీదేవి యెక్కడనున్నదో కాలినొప్పి పోవుట కెట్టుపనోద పెట్టఁబడుచున్నదో తెలిసికొనిరమ్ము.

ప్రతీ— దేవరయాజ్ఞాప్రకారము చేసెదను.

(అని పోవుచున్నది)

రాజు—గౌతమా! నీసఖురాలయిన యామెవృత్తాంత మేమి?

విదూ—పిల్లచేతఁ బట్టుపడినకోకిల వృత్తాంతమువలెనున్నది.

రాజు—(విషాదముతో) ఎందుచేత?

విదూ—ఖిన్నురాలయియున్న యామె కన్నుల నిప్పులొలుకు దేవిచేతఁ బాతాళగృహమునఁ ద్రోయింపఁబడినది.

రాజు—నన్నుఁ దారసించినందుకుఁ గాఁబోలును.

విదూ—అవును.

రాజు—ఈవిధముగా శత్రువులెవరు దేవిగారికిఁ గోపము తెప్పించినారు?

విదూ—దేవా! వినుము. కాలినొప్పిచేత బాధపడుచున్న దేవిగారిక్షేమవార్త యడుగుటకయి యిరావతి యక్కడికిఁబోయి యుండినదని పరివ్రాజిక నాతోఁ జెప్పినది.

రాజు—అటుతరువాత?

విదూ—మనప్రియవల్లభుఁ డేల దర్శనమియ్య లేదని దేవి యడిగినది. "మన ప్రియవల్లభుఁ డేమి? ప్రియవల్లభత్వము మన పరిజనముపాలయినట్టు మీకింకను దెలియు నేలేదా?" అనిదానికామె యుత్తరమిచ్చినది.

రాజు—అయ్యో! ఈయుపన్యాసమువలన మాళవికమీఁద నే యనుమానము పోయినదని చెంతిల్లుచున్నాను.

విదూ—అటుతరువాత దేవి నిర్బంధపెట్టి యామెవలన నీ యవినయ మంతయుఁ దెలిసికొన్నది.

రాజు—ఏమి దాని దీర్ఘరోషము ! అటుపిమ్మట జరిగినది చెప్పు.

విదూ—ఇంక నే మున్నది? మాళవికయు వకుళావళికయుఁ గాళ్ళసంకిళ్ళతో నాగకన్యలవలెఁ సూర్యకిరణములుచొరనిపాతాళ గృహనివాసము ననుభవించు చున్నారు.

రాజు—అయ్యో! పాపము!

గీ. మధురముగఁ గూయుపికమును మధుపసఖియుఁ
బెద్దగాలితోఁడి యకాలవృష్టిచేతఁ
గుసుమితంబగు క్రొమ్మావి గున్న విడిచి
తొఱ్ఱచేరంగ వలసెఁగా తోడులేక.

మిత్రుఁడా ! ఇక్కడ మన మేమైనఁ జేయుట కవకాశ మున్నదా?

విదూ—ఏమి యవకాశ మున్నది? నాముద్రయుంగరమును నీకుఁ జూపినంగాని మాళవికను వకుళావళికను విడువ వల దని దేవిగా రాచెఱసాలకుఁ గావలిపెట్టిన మాధవికకు గట్టియుత్తరువు చేసినారు.

రాజు—(నిట్టూర్పు విడిచి విచారముతో) మిత్రుఁడా! ఇక్కఁడ జేయవలసిన పని యేమి ?

విదూ—ఇప్పు డొక్కయుపాయ మున్న.

రాజు—అది యేడి?

విదూ—(అన్నివైపులనుజూచి) మనకుఁ గనఁబడక యెవ్వరైనను విందురు, నీచెవిలోఁ జెప్పెదను. (సమీపించి చెవిలోఁ జెప్పి) ఈలాగుననే చేయవలెను.

రాజు—(హర్షముతో) ఈయుపాయము చక్కఁగా నున్నది. కార్యసిద్ధికొఱకు దీనిని బ్రయోగింపవలెను.

[ప్రతీహారి ప్రవేశించు చున్నది.]

ప్రతి—దేవా! రక్తచందనజలముతోఁ గలిపినమంచిగంధమును గాలికిఁ జేతులతోఁ బరిజనులు పట్టించు చుండఁగా మంచిగాలి వచ్చెడిచోటఁ బరుండి దేవిగారు పరివ్రాజిక చెప్పుకథలు వినుచుఁ బ్రొద్దుపుచ్చు చున్నారు.

రాజు—అట్లయినయెడల మనముపోయి చూచుట కిది మంచి సమయము.

విదూ—మీరు వేంచేయుఁడు. నేనును దేవిగారికిరిక్తహస్తములతోఁ జూడఁగూడదు గనుక నేదయినసమకూర్చుకొనివచ్చెదను.

రాజు—ఇది యంతయు జయసేనకుఁ జెప్పి మఱి పొమ్ము.

విదూ—ఆలాగే. (చెవిలోఁ జెప్పి) ఈలాగునఁ జేయవలెను.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

రాజు—జయసేనా! గాలిలో వేయఁబడిన దేవియొక్కశయనమునకు దారి చూపుము.

ప్రతి—దేవా! ఇటు. ఇటు.

[అప్పుడు పాన్పుమీఁద ధారణీదేవియు, పరివ్రాజికయు యుక్తపరివారమును బ్రవేశించు చున్నారు.]

దేవి—అమ్మా! కథ బహురమణీయముగానున్నది. ఆపయిని—

పరి—(చూపు నిగిడించి) ఆపయిని దరువాతఁ జెప్పెదను. ప్రభువు లైనవిదిశాపురాధీశ్వరులు వచ్చుచున్నారు.

దేవి—ఆహా! భర్తగారా? (అని లేవఁబోవు చున్నది)

రాజు—లేవఁబోకు, ఉపచారగౌరవ మింతతోఁ జాలును.

గీ. అందియలఁ బాయుటకు నోర్వ కందమొదలి
పసిఁడిపీఠముపై మోపఁబడినయట్టి
నీదుకాల్నొవ్వఁగాఁజేసి నాదుమదికి
బాధ గలిగింపఁబోల దోభవ్యవాణి.

దేవి—ప్రాణేశ్వరా! జయము జయము.

పరి—దేవరవారికి విజయ మగునుగాక !

రాజు—(పరివ్రాజికకు నమస్కరించి కూరుచుండి) దేవీ! నొప్పి సహింపఁదగి యున్నదా?

ధార—కొంత గుణముగా నున్నది.

[అప్పుడు బొట్టనవ్రేలు జన్నిదముతోఁ గట్టుకొని తొట్రుపాటుతో విదూషకుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

విదూ—రక్షింపుఁడు. రక్షింపుఁడు. నన్నుఁబాముకఱచినది.

(అందఱును విషాదము నొందు చున్నారు.)

రాజు—అయ్యో! నీవెక్కడఁ దిరిగినావు?

విదూ—దేవిగారి దర్శనము చేయవలెనని యాచారము చొప్పునఁ బుష్పములనిమిత్తము నేనుద్యానవనమునకుఁ బోయినాను.

ధార—అయ్యో! పాపము! నేనే యీబ్రాహ్మణుని ప్రాణ సంశయమునకు హేతుభూతురాల నయినాను.

విదూ—అట్లు పోయి పుష్పమునిమిత్తమయి కుడిచేయి యశోకవృక్షముమీఁదికిఁ జాఁచునప్పటికి, మృత్యుదేవత సర్పరూప మునఁ దొఱ్ఱలోనుండి వెడలివచ్చి కాటు వేసినది. ఇదిగో నావ్రేలి మీఁద రెండుకాట్లును జూడుఁడు. (అని చూపు చున్నాఁడు)

పరి—గీ. పాముకఱచినవారలబ్రతుకుటకును
గఱచినట్టియంగంబును నఱుకుటొండెఁ

గాల్చుటాండెను రక్తంబు గంటునుండి
తీయుటాండెను శీఘ్రంబ చేయువలయు.

ఇప్పుడు విషవైద్యులు, తమపని చేయవలెను.

రాజు—జయసేనా! ధ్రువసిద్ధిని వెంటనే పిలుచుకొనిరమ్ము.

ప్రతి—దేవరవారియాజ్ఞాప్రకారము చేసెదను.

(అని పోవుచున్నది.)

విదూ—అయ్యో! నేను బాపపుచావు చచ్చుచున్నాను.

రాజు—భయపడఁబోకు. ఒకానొకప్పుడు పాముకాటుకువిష ముండదు.

విదూ—నే నెట్లు భయపడకుండఁగలను? నాసర్వావయవములును దిమ్మిరెక్కుచున్నవి. (అని విషోద్రేకమును జూపుచున్నాఁడు.)

ధార—అయ్యో! అయ్యో! ఇతఁడువిషవికారముచేతవడఁకుచున్నాఁడు. పట్టుకొనుడు.

పరి—(తొట్రుపాటుతో పట్టుకొనుచున్నది.)

విదూ—(రాజును జూచి) నీకు నేను బాల్యమునుండియుఁ బ్రియమిత్త్రుఁడనుగా నున్నాను. ఇప్పటిప్రేమను మార్పక పుత్రహీనురాలయ్యెడుమాతల్లి యోగక్షేమములకు భారమువహింపుము.

రాజు—బెదరఁబోకు. ఇప్పుడే వైద్యుడు చికిత్సచేసి నిన్ను బాగుచేయును. స్థిరచిత్తుఁడవు కమ్ము.

జయ—(ప్రవేశించి) ఓ మహారాజా! ధ్రువసిద్ధి దేవరవారియాజ్ఞను విని గౌతమునినక్కడకే పంపవలయునని విన్నపము చేయుచున్నాఁడు.

రాజు—అట్లయినఁ గంచుకి సహాయముతో నీతనిని ధ్రువసిద్ధి యొద్దకుఁ జేర్పుము.

జయ—అలాగే.

విదూ—(దేవివంకఁ జూచి) అమ్మా! నేను జీవించినను జీవింపకపోయినను రాజుగారిసేవకుఁడ నగుటచేత మీవిషయమునఁ జేసిన యపరాధములను క్షమింపవలెను.

ధార—నీవు దీర్ఘాయుష్మంతుఁడవు కమ్ము.

(విదూషకుఁడును ప్రతీహారియు నిష్క్రమించుచున్నారు)

రాజు—ఖిన్నుఁడై యున్నయితఁడు స్వభావముచేతనే పిఱికి వాఁడు. ధ్రువసిద్ధి సార్థకనామము కలవాఁడయినను గుదురు వని యెంచకున్నాఁడు.

జయ—(ప్రవేశించి) దేవా! జయముగుఁగాక! జయ ముగుఁ గాక! నీటికుండలో వేసి చికిత్సచేయుటకయి సర్పముద్ర గలయుంగర మెక్కడ నైనను వెదకి సంపాదింపవలెనని ధ్రువసిద్ధి యేలినవారితో మనవి చేయుచున్నాఁడు.

ధార—సర్పముద్రగలయుంగర మిక్కడనే యున్నది. ఇదిగో దీనిని బని తీఱినతరువాత మరలఁ దెచ్చి నాచేతి కిమ్ము.

(అని జయసేన కిచ్చుచున్నది)

రాజు—జయసేనా! పని కాఁగానే శీఘ్రముగాఁ దీసికొనిరమ్ము.

జయ—దేవర యాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని వెడలిపోవుచున్నది)

పరి—గౌతమునికి విషము దిగినదని నామనస్సునకుఁ బొడ కట్టుచున్నది.

రాజు—అట్లే జరగునుగాక!

జయ—(ప్రవేశించి) దేవా! జయముగుఁగాక! జయ ముగుఁ

గాక! గౌతమునికి విషవేగము తగ్గినది. అతఁడు ముహూర్తకాలములో మరల నెప్పటివాఁ డయినాఁడు.

ధార—భాగ్యవశముచేత నేను నిందనుండి విముక్తురాల నయినాను.

జయ—ఆలోచింపవలసిన రాజకార్యము లనేకము లున్నవి గనుక దర్శన మనుగ్రహింపఁ గోరుచున్నానని మంత్రియైన వాహతకుఁడు దేవరవారితో విన్నపము చేయుమన్నాఁడు.

ధార—దేవరవారు కార్యపర్యాలోచనముకొఱకు విజయం చేయవలెను.

రాజు—దేవీ! ఈప్రదేశమున నెండసోఁకుచున్నది. ఈబాధకు శీతలోపచారము ప్రశస్తము. కాఁబట్టి నీపాన్పును మఱియొకచోట వేయించుకొమ్ము.

ధార—ఓపరిచారికలారా! మీరు భర్తగారు సెలవిచ్చిన ప్రకారము చేయుఁడు.

పరిచారికలు—మంచిది. (అని ఆప్రకారముగానే చేయుచున్నారు)

[ధారణీదేవియు, పరివ్రాజికయు, పరివారమును, పోవుచున్నారు]

రాజు—జయసేనా! గూఢమార్గమునఁ బ్రమదవనమునకుఁ దీసికొనిపొమ్ము.

జయ—దేవా! ఇటురండు.

రాజు—జయసేనా! గౌతముఁడు తనయభీష్టమును నెఱవేర్చినాఁడుగదా?

జయ—నిస్సందేహముగా.

రాజు—క. ఇష్టావాప్తికిఁ గడు ను
త్కృష్టం బీక్రియ యటంచు నెఱిఁగియుఁ గష్టం
బిష్టార్థసిద్ధి యంచును
స్పష్టముగా మనసు జంకు పడియెడు నాకున్.

[విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ—మీకు జయమగుఁగాక! జయమగుఁగాక! దేవర వారిమంగళ కార్యములు సిద్ధిపొందినవి.

రాజు—జయసేనా! నీవుకూడ నీపనికిఁబొమ్ము.

జయ—దేవరవారాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని పోవుచున్నది.)

రాజు—గౌతమా! ఇప్పుడు క్షుద్రురాలయిన మాధవిక కొంచెమయిన ననుమానపడ లేదా?

విదూ—దేవిగారి ముద్రయుంగరమును జూచి యెట్లనుమాన పడును?

రాజు—నేనుంగరమునుగూర్చి మాటాడలేదు. దేవి యేహేతువుచేత వీరిద్దఱిని విడిపించినది, తనపరిజనమును మాని నిన్నేలపంపినది, అని యది యడిగి యుండవలెను.

విదూ—నన్నది యాప్రశ్న లడిగినది. నేను మందుఁడనయినను వెంటనే సమయోచిత మయిన ప్రత్యుత్తరములిచ్చినాను.

రాజు—ఏమని?

విదూ—జ్యోతిష్కులు రాజుగారినక్షత్రమునకుఁ గ్రూరగ్రహబాధ గలిగినదనియు, అందుచేత నవశ్యముగాఁ జెఱలో నున్నవారి నందఱిని విడిచిపెట్టింప వలయు ననియు, రాజుగారితో విన్నపము చేసిరని నేను జెప్పితిని.

రాజు—(హర్షముతో) అటుతరువాత.

విదూ—ఆసంగతి విని దేవి యిరావతి మనస్సునకు నొప్పి కలుగకుండుటకయి "రాజుగారే విడిపించుచున్నా" రని నన్నుఁ బంపినదని చెప్పినాను. అయి యుండవచ్చు నని యందుమీఁద మాధవిక కార్యసాఫల్యము చేసినది.

రాజు—(విదూషకుని కౌఁగిలించుకొని) మిత్రుఁడా! నా యెడల నీకుఁ బ్రేమ యున్నది కదా?

గీ. బుద్ధి గుణమున నే మిత్రములకు నిలను
గార్యదర్శన మెప్పుడుఁ గాదు సుమ్ము
స్నేహమునఁగూడ లభియించి నెగడుఁజూవె
కార్యసిద్ధికి సూక్ష్మమార్గంబు సఖుఁడ!

విదూ—మీరు త్వరపడవలెను. సఖీసహితురాలయిన మాళవికను సముద్రగృహమునం దుంచి మీనిమిత్తమయి యెదురుగా వచ్చినాను.

రాజు—నే నామెను గౌరవించెదను. నీవు ముందునడువు.

విదూ—దేవా! రండి రండి. (అని కొంచెము నడిచి) ఇదిగో సముద్రగృహము.

రాజు—(భయముతో) మిత్రుఁడా! అదిగో చేతులతోఁ బూవును కోయుచు నీ యిష్టురాలయిన యిరావతి పరిచారిక చంద్రిక మన వైపునకే వచ్చుచున్నది. ఇప్పు డది పోయినదాఁక మన మీ గోడచాటున దాఁగు కొందము.

విదూ—ఓహో! చోరులకును జారులకును చంద్రిక సరిపడదుగదా?

(ఇద్దఱును చెప్పినట్లు చేయుచున్నారు)

రాజు—మిత్రుఁడా! నీ చెలి నానిమిత్తమయి యెదురుచూచు చుండును. ఈగవాక్షమును జేరి యామెను జూతము రమ్ము.

విదూ—అలాగే.

(ఉభయులను నిలుచుండి చూచుచున్నారు.)

[అప్పుడు మాళవికయు వకుళావళికయుఁ బ్రవేశించుచున్నారు.]

వకు—సఖీ! భర్తగారికి మ్రొక్కుము.

మాళ—ఓభర్తా! నీకు నమస్కారము.

రాజు—వకుళావళిక నాప్రతిరూపమును నిర్దేశించి పలుకు చున్నదని శంకించెదను.

మాళ—(హర్షముతో ద్వారమువంకఁ జూచి) సఖీ! నన్ను మోసపుచ్చుచున్నావా? (అని విషాదము చూపుచున్నది.)

రాజు—ఆమె హర్షవిషాదములకు నేను బ్రీతుఁడ నయినాను.

గీ. సూర్యుఁ డుదయించుచోఁ గ్రుంకుచోఁ గరంబు
జలజము వికాససంకోచములను దాను
బూనునట్లుగ నీపద్మముఖముఖంబు
క్షణములోపల రెండవస్థలను దాల్చె.

వకు—అడుగో భర్త చిత్రపటమునం దున్నాఁడు.

ఇద్దఱు—(మ్రొక్కి) దేవా! మేలుకలుగుఁగాక! మేలు కలుగుఁగాక!

మాళ—సఖీ! అప్పుడు తొందరలో నిలుచుండి చూచుటచేత రాజుగారిరూపమునందు నా కాశ యెట్లు తీఱలేదో, అట్లే యిప్పుడు రాజుగారిరూపము తృప్తికరముగా నుండలేదనియే నేనుభావించెదను.

విదూ—వినుచున్నావా? నీవు కనఁబడునట్టుగాఁ జిత్రపట మునం దుండలేదని యీామె తలఁచుచున్నది. పెట్టెయందలి రత్న

రాశివలెనే యిప్పుడు నీవు యౌవనగర్వము వహించుట వ్యర్థ మగుచున్నది.

రాజు—మిత్రుఁడా! కుతూహలము గలవారయినను స్త్రీలు సహజముగా సిగ్గు గలవారుగా నుందురు. చూడు—

చ. తరుణులు వేడ్కతోఁ బ్రథమదర్శనకాలమునందుఁ దద్దయున్
బురుషులరూపముల్ నయనము ల్తనియంగను జూడఁగోరియున్
ధరఁ దరళాయతాక్షులు మనఃప్రియులం దిలకించుపట్టులన్
గరమును విప్పి గన్గొనఁగా కనుదమ్ములనిండ నెప్పుడున్?

మాళ—సఖీ! మొగము ప్రక్కకుఁ ద్రిప్పుకొని భర్తగారిచే బ్రేమగలచూపులతోఁ జూడఁబడుచున్నయామె యెవరు?

వకు—పార్శ్వమునందున్న యిరావతిక దా యామె?

మాళ—సఖీ! పట్టపుదేవుల నింతటిని విడిచిపెట్టి యొక్క యీమెవంకనే తెప్పవాల్చక చూచుచుండుట చూడఁగా నాకు రాజుగారు దాక్షిణ్యము లేనివారుగాఁ గనఁబడు చున్నారు.

వకు—(తనలో) చిత్రపటములో నున్నరాజును నిజమయినవానినిగా భావించుకొని యీమె యసూయను గనఁబఱుచుచున్నది. కానిమ్ము. నేను దీనిచేఁ గొంచెముసేపు వినోదించెదను. (ప్రకాశముగా) సఖీ! భర్తగారి కీమె యత్యంతప్రియురాలు.

మాళ—అట్లయిన నేనిప్పుడు నాహృదయము నేల యాయాసపెట్టుకొవలెను? (అని యసూయతోఁ దిరుగుచున్నది.)

రాజు—మిత్రుఁడా! చూడు చూడు.

చ. బొమముడిచేత బొట్టుచెడ, మోవియు నించుక సంచలింపఁగా,
రమణి యసూయతో మరలి ప్రక్కకు వంగెడు పెంపు చొల్చెడు

న్రిమణుఁడు తప్పుచేయ నిటు నాయికి కోపము చూపఁజెల్లు నం
చమర గురుండు నేర్పు లలితాభినయంబును బట్టునట్టుగన్.

విదూ—ఇప్పుడు నీవామె ననునయించుటకు సిద్ధముగా నుండుము.

మాళ—ఇక్కడఁ బూజ్యుఁడయిన గౌతముఁడుకూడ నీకెను సేవించు చున్నాఁడే.

(అని మరల మరియొకవంకకు మరలఁ బోవుచున్నది.)

వకు—(మాళవికను నివారించి) మరలవలదు. నీవిప్పుడు కుపితురాలవయి యున్నావు.

మాళ—నీవు నన్ను దీర్ఘక్రోధము కలదానినిగాఁ దలఁచెదు పక్షమున, నాకోపము నిప్పుడే విడిచెదను.

రాజు—(సమీపమునకుఁ బోయి)

గీ. అతివ! ప్రత్యక్షదాసుఁడ నగుచు నీకు
నే ననన్యసాధారణవృత్తి నుండఁ
జిత్రగతుఁడనై యున్న నాచేష్టఁ జూచి
యిపుడు కోపంబు వహించె దేల నీవు?

వకు—దేవా! జయమగుఁగాక! జయ మగుఁ గాక!

మాళ—(తనలో) చిత్రపటములోనున్న భర్తగారియెడల నే నేల యసూయపడితిని?

(సిగ్గుతోఁ దలవంచుకొని చేతులు జోడించుచున్నది.)

రాజు—(కామచాంచల్యమును గనఁబఱుచుచున్నాఁడు.)

విదూ—నీ వుపేక్షాపరునివలెఁ గనఁబడుచున్నా వేమి?

రాజు—నీ సఖురాలియొక్క యవిశ్వసనీయతవలన.

విదూ—నీ కీమెయెడ నవిశ్వాస మేలకలిగినది?

రాజు—

చ. నయనపథంబుఁ జేరియు క్షణంబున నిప్పు డదృశ్యయౌను, నీ
ప్రియసఖి చేతికిం దగలభించియుఁ జిక్కక వేగఁ బాఱు, నే
రయమునఁ గామపీడ నిటుగ్రాఁగ సమాగమమాయచేత, నో
ప్రియుఁడ! మదీయచిత్తమెటు వేగమ యీమెను విశ్వసించెడున్?

వకు—సఖీ! రాజుగారు పలుమాఱు మోసపోయినారు. కాఁబట్టి నీవిప్పుడు విశ్వసనీయురాలవు కమ్ము.

మాళ—మందభాగ్యురాల నయిన నాకు రాజుగారిపొందు స్వప్నములో సహితము దుర్లభమాయెను.

వకు—రాజా! ఈమె కుత్తర మిమ్ము.

గీ. ఉత్తరంబియ్య నేల? కామోజ్జ్వలాగ్ని
సాక్షిగా నన్నెయిపుడు నీసఖికి నేను
నర్పణము చేసికొనెద రహస్యముగను
సేవ్యుఁడనుగాను నేనింక సేవకుండ.

వకు—నే ననుగ్రహింపఁబడిన దాన నయినాను.

విదూ—(కొంచెము నడిచి తొట్రుపాటుతో) వకుళావళికా! లేడి యశోకపల్లవములను దాటఁబోవు చున్నది. దానినిదోలివత్తము రమ్ము.

వకు—మంచిది. (అని బయులుదేఱు చున్నది.)

రాజు—ఆవిధముగానే మీరు మమ్ము సహితము రక్షింప వలయును.

విదూ—గౌతముఁడు మిమ్ముసహితము కాచుచుండును.

వకు—(రహస్యముగా) అయ్యా! గౌతమా! నేను గనఁబడక దాఁగియుండెదను. నీవు ద్వారరక్షకుఁడవు కమ్ము.

విదూ—మంచిది.

వకు—(నిష్క్రమించుచున్నది.)

విదూ—ఇంతలోపల నే నీస్ఫటికశిలా వేదికమీఁదఁ బరుండె దను. ఓహో! ఈశిలావిశేష మెంతసుఖస్పర్శనిచ్చుచున్నది!

(అని కూరుచుండినిద్రపోవుచున్నాఁడు.)

మాళ—(భయముచేత వడఁకుచున్నది)

రాజు—గీ. భయము విడువుము నన్గూఁడ, భాసురాంగి!
తడవు నీపయిఁ బ్రణయంబు తగిలియుండి
నేను సహకారతను నిందుఁ బూనినాఁడ;
నల్లుకొను మాధవీలత వగుచు నీవు.

మాళ—దేవిగారివలనిభీతిచేత నాకుఁ బ్రియమైనపని నైనను జేసికొనఁజాలకున్నాను.

రాజు—నీవు భయపడవలసిన పనిలేదు. భయపడవలసిన పనిలేదు.

మాళ—నన్ను భయపడవలదని యుపదేశించెడు భర్తగారి ధైర్యమును వెనుక నే రిరావతియెదుటఁ జూచియున్నాను.

రాజు—గీ. కీరవాణిరో! వినుము దాక్షిణ్య మెపుడు
క్షితినినాయకులకుఁ గులవ్రతము సుమ్మి;
యట్టులయ్యు, నాప్రాణంబు లాయతాక్షి!
నిన్నె యాశించుకొని నిల్చియున్న విపుడు.

కాఁబట్టి చిరానురక్తుఁడనయియున్న నన్నునుగ్రహింపవలెను.

(అని కౌఁగిలించుకొనఁబోవుచున్నాఁడు.)

మాళ—(తప్పించుకొనుచున్నది.)

రాజు—(తనలో) శ్రోత్రకామినుల మదనవిషయమయిన యవస్థ మిక్కిలి రమణీయముగా నుండునుగదా?

మ. రశనాబంధము విప్పఁ బ్రేళ్ళుదుడుకార్పం జేయి కంపించు, ర
మ్యాశయంబుల్ చనుకప్పులా బలిమిమై నాశ్లేషముం జేయఁబో,
భృశమున్నద్దిడఁబోవఁ గన్నులఘుకం ద్రిప్పన్ముఖంబోరగా,
వశమయ్యెన్సుఖమిచ్చు కెక్కడుర ! నీవ్యాజంబుచేనైనను౯.

(అప్పుడిరావతియు నిపుణికయుఁ బ్రవేశించుచున్నారు.)

ఇరా—ఓసీ! నిపుణికా! సముద్రగృహముయొక్క తలవాకిట గౌతముఁడు కనఁబడినాఁడని చంద్రిక నీతో నిజముగాఁ జెప్పినదా?

నిపు—చెప్పకపోయినయెడల అమ్మగారితో నేనేలవిన్నపము చేయుదును?

ఇరా—అట్లయినచోఁ, బ్రాణసంశయమునుండి విముక్తుడయిన భర్తగారి ప్రియమిత్రుని క్షేమవార్త యడుగుటకును మన మక్కడకుఁ బోదము.

నిపు—మీమాటవలన మఱియేదో పసికూడ కలదనితోఁచుచున్నది.

ఇరా—అవును. చిత్రపటమునందున్న భర్తగారిని బ్రసన్నునిగాఁ జేసికొనుటకును.

నిపు—నీవు కేవల భర్తగారినే యేల ప్రసన్నుని జేసికొనరాదు?

ఇరా—ముద్దరాలా! మనసు మఱియొకరియందిడి కాఁటి యున్నభర్తగారు చిత్రపటమునం దెట్లున్నారో యట్లే యున్నారు. ఇప్పటి నా ప్రయత్నమంతయు నుపచార మతిక్రమించి వచ్చిననాలోపమును బాపుకొనుటకొఱకే.

నిపు—అమ్మా! ఇటు. ఇటు. (ఇద్దఱును నడుచుచున్నారు)

[ఒకచేటిక ప్రవేశించుచున్నది]

చేటి—అమ్మా! నీకు శుభమగుఁగాక! "ఇది మనకు మత్సరమునకుఁ గాలముకాదు. నీయెడఁ గలగౌరవమును గనఁబఱుచుటకొఱకే నేనిప్పుడు సఖీహితముగా మాళవికకు సంకెళ్ళు వేయించియున్నాను. వారిని విడిపించి భర్తగారికిఁ బ్రియము చేయుటకు నీవనుమతించినయెడల, ఆప్రకారముగాఁ జేసెదను. నీయిష్టమేమో నాకుఁ జెప్పి పంపుము" అని దేవిగారు మీతోఁ జెప్పుచున్నారు.

ఇరా—నాగరికా! 'దేవిగారి నీప్రకారముచేయుమని నియోగించుటకు నేనెంతటిదానను? పరిజనులను శిక్షించుటచేత దేవిగారు నాయందు గొప్ప యనుగ్రహము చూపినారు. నేనుమాత్ర మెవరి యనుగ్రహమువలన వర్ధిల్లినదానను?' అని దేవిగారికి విన్నపము చేయుము.

చేటి—ఆలాగే. (అని నిష్క్రమించుచున్నది)

నిపు—(కొంచెము నడిచిచూచి) అదుగో గౌతముఁడుసముద్రగృహద్వారమునం దంగడిలోని మాఁబోతువలెనే కూరుచుండి నిద్రపోవుచున్నాఁడు.

ఇరా—ఇతనికిఁ దిన్నఁగాఁ గుదురలేదాయేమి? ఇంకను విషవికారమున్నవానివలెనే కనఁబడుచున్నాఁడు.

నిపు—ముఖవర్ణము ప్రసన్నమయియే కనఁబడుచున్నది. అదిగాక ధ్రువసిద్ధి చికిత్సచేసినాఁడు. అందుచేత మనమితని కొఱకీడుకలుగునని శంకింపవలసిన పనిలేదు.

విదూ—(పలవరించుచున్నాఁడు) అమ్మా! మాళవికా!

నిపు—అమ్మా! విన్నావా? ఈతఁడెవరి కాప్తుఁడు? ఈకృత

ఘ్నుఁడు కేవల కుక్షింభరణపరాయణుఁడు. ఎల్లప్పుడును మనవద్ద స్వస్తివచనమోదకములచేతఁ గడుపు నింపుకొనుచు, ఇప్పుడు మాళవికయని పలవరించుచున్నాఁడు.

విదూ—మాళవికా! ఇరావతిని మించినదానవు కమ్ము.

నిపు—ఏమియీ ప్రలాపము! పామన్న భయపడెడి యీ బ్రాహ్మణాధమునిఁ బామువలె వంకరగానున్న యీ కఱ్ఱతో స్తంభము చాటున దాఁగియుండి భయపెట్టెదను.

ఇరా—ఈ కృతఘ్నుఁడు పాము కఱువవలసినవాఁడే.

నిపు—(విదూషకునిమీఁద దండకాష్ఠమున్ను బడవేయుచున్నది)

విదూ—(ఉలికిపడిలేచి) అయ్యో! మిత్రుఁడా! నామీఁద బాముపడ్డది.

రాజు—(తొందరపడివచ్చి) భయపడకు! భయపడకు.

మాళ—(వెనుకనుండి) భర్తా! పామనుచున్నాఁడు. సాహసముచేసి పోవలదు.

ఇరా—అవురా! భర్తకూడ నీలాగుననే వచ్చుచున్నాఁడు.

విదూ—(పెద్దపెట్టుననవ్వి) ఇదియు దండకాష్ఠమేనా? నేనప్పుడు మొగలిముండ్లతో గీచుకొని పాముకఱచినదని బొంకినదానికి ఫలమే యిప్పుడు కలిగినదనుకొన్నాను.

[అప్పుడు తెరవెనుకనుండి వకుళావళిక ప్రవేశించుచున్నది]

వకు—భర్తగారు రావలదు. ఇక్కడ సర్పమువలెనే కుటిలవర్తనముకలిగి యేదో కనఁబడుచున్నది.

ఇరా—(వేగముగా రాజుగారివద్దకునడిచి) దంపతులయొక్క దివాసంకేతము నిర్విఘ్నముగా నెఱవేఱినదా?

[ఇరావతినిఁజూచి యందఱును భ్రాంతు లగుచున్నారు.]

రాజు—ప్రియురాలా! ఈయుపచార మపూర్వమయినదికదా?

ఇరా—వసుళావళికా! భర్తగారిద్వాతిక వయిన నీప్రతిజ్ఞ యిప్పుడు సంపూర్ణ మయినదా?

వసు—అమ్మా! శాంతింపు. నేనేమిచేసితినో రాజుగారి నడుగవచ్చును. కప్పలు కూయునని దేవుఁడు భూమిమీఁద వర్షము కురిపింప కుండునా?

విదూ—నీ వీలాగునఁ జేయఁబోకు. పాదములమీఁదఁబడినను నీవతిక్రమించి పోయినసంగతి దర్శనమాత్రముచేతనే యీాయన మఱచిపోయినాఁడు. నీవిప్పుడయినను బ్రసాదమును జూపకున్నావు.

రాజు—ఈపరిహారము నిష్కారణముగాఁ గోపపడుట నీకుఁ దగదు.

గీ. నిర్నిమిత్తంబ క్షణమేని నీముఖంబు
పడఁతి! యెప్పుడు మును కోపపాత్ర మయ్యె?
పర్వమునఁగాక చంద్రబింబంబు రాహు
కలుష మెల్లానొకో రాత్రి తెలుపు మీావు.

ఇరా—నిష్కారణముగా నని భర్తగారు చక్కఁగాసెలవిచ్చినారు! నాభాగ్య మన్యులపాలయినప్పుడు నేను మరలఁ గోపపడిన పక్షమున, నేనే హాస్యాస్పదురాల నగుదునుగదా?

రాజు—నీవన్యవిధముగాఁ గల్పించుకొనుచున్నావు. నాకు నిజముగా నీ కోపమునకు హేతువు కనఁబడకున్నది. ఎట్లన—

గీ. పండుగుదినంబులందునఁ బరిజనంబు
తప్పుగల్గియుఁ జెఱనుండఁ దగ దటంచు

వీరి నే విడిపింప, నగ్ జేరి ప్రొక్క
వీరు వచ్చి రింతియుకాని వేఱు లేదు.

ఇరా—నిపుణికా! నీవుపోయి మీాపక్షపాతము కనిపెట్టితినని దేవిగారితో విన్నవింపుము.

నిపు—ఆలాగే. (అని పోవుచున్నది.)

విదూ—(తనలో) అనర్థము సంభవించినది. బంధమునుండి తప్పించుకొన్న యింటిపావురము పిల్లికంట బడినదిగదా?

నిపు—(మరలఁ బ్రవేశించి) అమ్మా! దైవికముగా నాకిప్పుడు మాధవిక కనఁబడి దీనికి హేతువిది యని చెప్పినది.

(అని చెవిలోఁ జెప్పుచున్నది.)

ఇరా—(తనలో) నాకంతయు బోధపడినది. ఇదియంతయు నీతుచ్ఛబ్రాహ్మణుఁడు పన్నినపన్నుగడఁ (విదూషకునిజూచిబిగ్గరగా) ఇప్పుడిది యీాకామతంత్ర మంత్రిగారు ప్రయోగించిన నీతి.

విదూ—అమ్మా! నేను నీతియం దొకయక్షరమయినను జదివి యుండినయెడల, ఇట్లు రాజుగారి నాశ్రయించుకొనితిరుగుదునా?

రాజు—(రహస్యముగా) అక్కటా! నేనిప్పు డీచిక్కునుండి యెట్లు విముక్తి నొందుదును?

[వేగముగా జయసేన ప్రవేశించుచున్నది.]

జయ—దేవా! మీాకొమార్తె వసులక్ష్మి బంతినిమిత్తమయి పరుగెత్తుచు, పండుకోఁతి వచ్చి బెదరింపఁగా మిక్కిలి జడిసికొన్నది. ఆమెను దేవిగారు తమయొడిలోఁ బెట్టుకొని కూరుచున్నను గొంచెమయినను జ్ఞప్తిరాక పెద్దగాలిలోఁ గదలుచున్న చిగురాకువలె వడకుచున్నది.

రాజు—అయ్యో! అయ్యో! పసిపిల్ల లెంతపిఱికివారు!

ఇరా—(తొట్రుపాటుతో) ఆచిన్నదాని నోదార్చుటకయి భర్తగారు వేగిరము విజయంచేయవలెను. ఆమెకు సంతాపజనితమయిన వికారము వృద్ధిపొందకుండ వారింపవలెను.

రాజు—నేను బోయి జ్ఞప్తివచ్చునట్లు చేసెదను. (అని వేగముగాఁ బోవుచున్నాఁడు)

విదూ—మేలు! ఓరిపింగళవానరా! మేలు! నీవు స్వపక్షము వారిని రక్షించినావు.

[రాజును, విదూషకుఁడును, ఇరావతియు, నిపుణికయు నిష్క్రమించుచున్నారు]

మాళ—దేవిని దలఁచుకొని నాహృదయము కంపమొందుచున్నది. నాకిప్పుడేమి సంప్రాప్తము కానున్నదో తెలియకున్నాను.

తెరలో—ఆశ్చర్యము! ఆశ్చర్యము! దోహదముచేసి యయిదు రాత్రులయినను గడవకమునుపే కాంచనాశోకము మొగ్గలతో నిండిపోయినది. ఈసంగతి దేవిగారికి నివేదించెదను.

ఇద్దఱు—(విని సంతోషించుచున్నారు)

వకు—సఖీ! ఊఱటపొందుము. దేవి తాను జేసిన ప్రతిజ్ఞ తప్పదు.

మాళ—అట్లయిన మన ముద్యానవనపాలికల వెనుకనే పోవుదము.

వకు—ఆలాగే చేయుదము.

(అందఱును నిష్క్రమించుచున్నారు)

పంచమాంకము

[అప్పు డుద్యానవనపాలకురాలు ప్రవేశించుచున్నది]

ఉద్యా—నేను గౌరవపూర్వకముగాఁ గాంచనాశోకము చుట్టును గోడయరఁగును వేసినాను. నాకు నియోగించిన యీపనిని జేసితినని దేవిగారికి నివేదించెదను. ఇఁకవిధి మాళవికయందు దయ చూపవచ్చును. ఆప్రకారముగాఁ గుపితురాలైయున్న దేవి యిప్పు డీసంతోషమయిన యశోక దోహదవృత్తాంతముచేతఁ బ్రసన్నురా లగును. దేవి యిప్పు డెక్కడనుండియుండును? ఆహా! ఇదిగో దేవి గారి పరిచారకుఁడయిన కుబ్జుఁడొకఁడు చతుశ్శాలనుండి వచ్చు చున్నాఁడు. ఆతని నడిగెదను.

[అప్పుడు చేతియందుఁ బెట్టెపట్టుకొని కుబ్జుఁడుప్రవేశించుచున్నాఁడు]

(ముందుకునడిచి) సారసా! ఎక్కడకుఁ బోవుచున్నావు?

సార—మధురికా! విద్వాంసులయిన బ్రాహ్మణుల కియ్య వలసిన నెలదినముల నిత్యదక్షిణను పూజ్యుఁడయిన పురోహితునిచేతి కిచ్చి వచ్చుటకయి పోవుచున్నాను.

మధు—అది యెందునిమిత్తము?

సార—రాజుగారి కుమారుఁడు యజ్ఞాశ్వమును రక్షించుట కయి సేనాపతిచేత నియోగింపఁబడినాఁడని వినినప్పటినుండియు; అతని యాయుర్వృద్ధికొఱ కష్టశతసువర్ణపరిమాణధనము దక్షిణగా నిచ్చుటకు దేవిగారు ప్రతిజ్ఞ చేసినారు.

మధు—ఇప్పుడు దేవి యెక్కడనున్నది?

సార—మంగళగృహమునందుఁ బీఠముమీఁదఁ గూరుచుండి

విదర్భదేశమునుండి తనతమ్ముఁడయిన వీరసేనుఁడు పంపినకమ్మను లిపికారులచేతఁ జదివించి వినుచున్నది.

మధు—మరల విదర్భరాజవృత్తాంతక్షేమయినఁ దెలిసినదా?

సార—విదర్భరాజు వీరసేనునక్రింద నున్న సేనాచక్రము చేత లోఁబఱుచుకొనఁబడినాఁడు; అతని దాయాదుఁడయిన మాధవసేనుఁడును జెఱనుండి విడిపింపఁబడినాఁడు. అతఁడు దూతవెంట ముందుగా శ్రేష్ఠము లయినరత్నవాహనములను శిల్పవిద్యాప్రవీణత గల పరిజనమును, రాజుగారికిఁ గానుకగాఁ బంపి, తాను వెనుకవచ్చి ప్రభువువారి దర్శనము చేసికొనఁ బోవుచున్నాఁడు.

మధు—నీవుపోయి నీపనిని జేయుము. నేనును దేవిగారిని సందర్శింపఁబోయెదను. (అనియిద్దఱునుబోవుచున్నారు)

ఇది ప్రవేశము

[అప్పుడు ప్రతీహారి ప్రవేశించుచున్నది.]

ప్రతీ—అశోకసత్కారోత్సుకురాలయి యున్న దేవి "భర్తగారితోఁగలిసి నేనశోకవృక్షముయొక్క పుష్పసంపదను జూడఁగోరుచున్నాను" అని రాజుగారికి విన్నవింపుమని నాకాజ్ఞయిచ్చినది. కాఁబట్టి ధర్మాసనమునకు విజయంచేసెడు రాజుగారి రాకకయి నేను బ్రతీక్షించి యుండెదను. (అని తిరుగుచున్నది.)

తెరలోవైతాళికులు—ఓహో! రాజదండముచేత శత్రుశిరస్సులమీఁద వర్తించుచున్నాఁడు!

ప్రథముఁడు—

చ. పరబృతసుస్వరంబు తనుపర్వ విదిశానదిపొంతఁదోఁటలో
  వరరతితోడ రూపముఁబంచశరుండునుబోలె హాయిగా

విరళవసంత మీ రనుభవింపఁగ నిద్ధబలుండ వైన నీ
యరి వరదానదీ పరిసరాటవులన్ భవదీయభద్రకుం
జరములఁ గట్టినట్టిమహిజంబులతోఁ వహించు నమ్రమర్తన్.

ద్వితీయుఁడు—

చ. ధరణి విదర్భునిన్ డడముతాఁకున గెల్చిననీచరిత్రమున్,
బరిఘులవంటి బాహులబల్మిని రుక్మిణిఁగొన్నకృష్ణు స
చ్చరితముఁ, బద్యరూపమున నల్పి సురోపములైన పండితుల్
కరము! బఠింతు రల్ల క్రథకైశికధిక్కృతి వీరతుష్టికిన్.

ప్రతీ—అదె జయశబ్దము ప్రస్థానమును దెలుపఁగా రాజుగా రిచ్చటికే విజయంచేయుచున్నారు. నేను గౌంచెమాయనయెదుట నుండి తొలఁగి, ముఖద్వారతోరణము నాశ్రయించి నిలిచెదను.

(అని చాటువనిలుచున్నది.)

(అప్పుడు మిత్రిసహితముగా రాజు ప్రవేశించుచున్నాఁడు.)

రాజు—గీ. అకట! ప్రియురాలు దుర్లభ యౌటతలఁచి,
బలముచే విదర్భుఁడు గెల్వఁబడుట వినియు,
వానచే నెండచేఁ గొట్టఁబడినతమ్మిఁ
బోలి, దుఃఖమును సుఖంబుఁ బొందు మనసు.

విదూ—నీవత్యంతసుఖవంతుడ వగుదువని నామనస్సునకుఁ బొడకట్టుచున్నది.

రాజు—ఏలాగున?

విదూ—ఇంతకుముందే ధారణీదేవి "అమ్మా! నీవలంక రించుటయందు సాటిలేనిదానవని గర్వపడు చుంటువుగనుక వివాహ

లంకార రచనయందలి నీనేర్పు నిప్పుడు మాళవిక శరీరమునిూఁదఁ గనఁబఱుపుము'' అని పండితకౌశికితోఁ జెప్పినది. అందుచేత నామె విశేష కౌతూహలముతో మాళవిక నలంకరించినది దేని నీమనో రథము నెఱవేర్చునేమో!

రాజు—మిత్రుఁడా! ఎప్పుడును నాయిష్టము ననుసరించెడు ధారణీదేవియొక్క పూర్వచరితమును విచారింపఁగా నీవు చెప్పినట్లు జరగనే వచ్చును.

ప్రతీ—(ప్రవేశించి) దేవా! జయముగుఁగాక! జయముగుఁ గాక! కాంచనాశోకముయొక్క పుష్పోద్గమసంపదను భర్తగారితోఁ గూడ సందర్శింపఁ గోరుచున్నానని దేవిగారు విన్నపము చేయు మన్నారు.

రాజు—దేవి యక్కడనే యున్నదా?

ప్రతీ—అవును. వారివారి కర్హమైనసమ్మానముచేసి యంతః పురజనమును బంపివేసి పరిజనముతో మాళవిక ముందు నడువఁగా దేవి తాను దేవరవారిరాకకయి, నిరీక్షించుచున్నది.

రాజు—(సంతోషముతో విదూషకునివంకఁజూచి) జయసేనా! నీవు ముందు నడువు.

ప్రతీ—దేవా! రండి రండి. (అని నడుచుచున్నది)

విదూ—(చూచి) ఓమిత్రుఁడా! వసంతుఁ డీయుద్యానవన మునందుఁ గొంచెము యౌవనదశను బొందినవానివలెఁ గనఁబడు చున్నాఁడు.

రాజు—నీవన్నమాట సత్యము.

గీ. వంగి కురువకఫలజాలభారమునను
జూతభూజహ మల్లదె చూడు మెదుట

రహిని నీబుతుయౌవనారంభ మనఁగ
మదికి నుత్కంఠ గొలిపెడు మఱియు మఱియు.

విదూ—మిత్రుఁడా! అదిగో కాంచనాశోక మలంకారము చేసికొన్నదానివలెనే పూవుగుత్తులచేత నొప్పుచున్నది. దేవరవారు చిత్తగించవలెను.

రాజు—ఇప్పు డిది యనన్యసాధారణ మయిన శోభనువహించుచున్నది. గనుక, ఆలస్యముగాఁ బూతఁపట్టుటయే యుక్తముగా నున్నది. చూడు—

గీ. మొదలను వసంతవిభవంబు పూనినట్టి
సకలసుందరాశోకవృక్షములసొంపు
దోహదము నొందియున్న యీద్రుమమునందె
సంక్రమించె ననఁగ మొగ్గచాలు పొలుచు.

విదూ—నిశ్చయముగా నీవు సంతుష్టుఁడవుకమ్ము. మన మీప్రకారముగా సమీపమునకు వచ్చియున్నను, ధారణీదేవి తన పార్శ్వమునందున్న మాళవిక నిలుచుట కనుమతించుచున్నది.

రాజు—(సంతోషముతో) సఖుఁడా! చూడు చూడు.

క. వినయమునం బ్రియురా లటు
వెనుకఁ గరాబ్జములు వేడ్కను నిలువన్
నను దేవి యెదుర్కొనియెడుఁ
బొనరఁగ నృపలక్ష్మితోడి భూదేవి యనన్.

[అప్పుడు ధారణీదేవియు, మాళవికయు, పరివ్రాజికయు,
అర్హపరిచారమును. ప్రవేశించుచున్నారు]

మాళ—(తనలో) నాకౌతుకాలంకారమునకు హేతు వెఱుఁ

గుదును. అయినను నాహృదయము తామరాకుమీఁదనీటివలెఁ దల్లడిల్లుచున్నది. నాయెడమకన్ను బలుమారు అదరుచున్నది.

విదూ—ఓహో! మిత్రుఁడా! వివాహాలంకారముచేతఁ బూజ్యురా లయినయీమాళవిక మిక్కిలి శోభిల్లుచున్నదిగదా?

రాజు—ఆమెను జూచుచున్నాను.

గీ. చాలఁ బ్రేలని పట్టువస్త్రంబు గట్టి
మితవిభూషణములతోడ మెఱయు నీమె
హిమము గ్రమ్మని నక్షత్రసమితితోడఁ
బ్రబలచంద్రికగల చైత్రరాత్రిఁ బోలి.

ధార—(సమీపించి) ప్రాణేశ్వరా! జయ మగుఁగాక! జయ మగుఁగాక!

విదూ—అమ్మా! వర్ధిల్లుము.

పరి—దేవా! విజయ మగుఁగాక!

రాజు—అమ్మా! నమస్కరించుచున్నాను.

పరి—అభీష్టసిద్ధి యగుఁగాక!

ధార—(చిఱునవ్వునవ్వి) ప్రాణేశ్వరా! తరుణీజనసహాయుఁడవయిన నీకీయశోకవృత్తము మాచేత సంకేతగృహముగాఁ జేయఁబడినది.

విదూ—మిత్రుఁడా! నీవు సత్కరింపఁబడినావు.

రాజు—(సిగ్గుతో అశోకమువంకఁ దిరిగి)

గీ. అలవసంతని రాఁగ మనాదరించి
యాదరించె నీదుప్రయత్న మలరుఁబూని
కావున నిట్టిదేవిసత్కారమునకు
నియ్యశోక మర్హత నేల యొనయకుండు?

విదూ—ఓయీ! పరువము గలదానిని జూడుము.

ధార—ఎవ తెను?

విదూ—నేను గాంచనాశోకముయొక్క పుష్పశోభనుగూర్చి చెప్పుచున్నాను. (అందఱును గూరుచున్నారు.)

రాజు—మాళవికనుజూచితనలో) సన్నిధినుండియు వియోగ మనుభవించుట కష్టముగదా?

క. ఏను రథాంగముమాడ్కిని
గానంగాఁ జక్రవాకిగతిఁ బ్రియురాలుఁ
మానెఱపొం దొదవింపని
తా నీధారిణి నిశవలెఁ దనరెద మించటః.

కంచు—దేవా! జయ మగుఁగాక! "అప్పుడు మార్గాయా సముచేత దేహములు బడలియున్నారని విదర్భరాజు కానుకగాఁ బంపిన శిల్పవిద్యాప్రవీణ లయినయిద్దఱు కాంతలను దమదర్శనము నకుఁ బంపలేదు. వారిప్పుడు దేవరవారిని సందర్శింప శక్తి గలవా రుగా నున్నారు. కాఁబట్టి దేవరయాజ్ఞ దయసేయవలెను" అని మంత్రి విన్నపము చేయు మన్నాఁడు.

రాజు—వారిని దీసికొని రమ్ము.

కంచు—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను. (అని నిష్క్రమించి వారితోఁగూడఁ బ్రవేశించి) అమ్మలారా! ఇటు, ఇటు.

ప్రథమ—(రహస్యముగా) ఓసీ! రజనికా! ఈయపూర్వ మయినరాజకులమును జేరఁగా నామన స్సూరట పొందుచున్నది.

ద్వితీయ—జ్యోత్స్నికా! నాకును నాలాగుననే యున్నది. "హృదయముయొక్కయవస్థయే రాఁబోవుసుఖమునుగాని దుఃఖమును గాని తెలుపు" నని యొకలోకోక్తి సుమా.

ప్రథము—అది యిప్పుడు సత్య మగునుగాక!

కంచు—అదె రాజుగారు దేవితోఁగూడ నుండియున్నారు. మీరాయనయొద్దకుఁ బొండు. (ఇద్దఱు సమీపమునకుఁ బోఁగా మాళవికయుఁ బరివ్రాజికయు వారిని జూచి యొకరినొకరు చూచు కొనుచున్నారు)

ఇద్దఱు—(ప్రమాణముచేసి) దేవా! జయమగుఁగాక! జయ మగుఁగాక! దేవీ! జయమగుఁగాక! జయమగుఁగాక!

రాజు—కూరుచుండుఁడు.

ఇద్ద—(కూరుచున్నారు)

రాజు—మీ కేవిద్యయం దభిని వేశము గలదు?

ఇద్ద—దేవా! సంగీతవిద్యయందు.

రాజు—దేవీ! వీరిలో నొకరిని నీవు తీసికొమ్ము.

ధార—మాళవికా! వీరిలో సమర్థురాలయిన యెవరిని సంగీతమునందు సహాయురాలినిగాఁ దీసికొనుటకు నీకిష్టముగానున్నది?

ఇద్ద—(మాళవికనుజూచి) ఓహో! రాజపుత్రికా! రాజపుత్రీ! జయమగుఁగాక! జయమగుఁగాక! (అని నమస్కరించి యామెతోఁ గూడఁ గన్నీరు విడుచుచున్నారు)

అందఱు—(అద్భుతపడి చూచుచున్నారు)

రాజు—కాంతలారా! ఈమె యెవరు?

ఇద్ద—ఈమె మారాజుగారి కొమార్తె.

రాజు—ఏలాగున?

ప్రథమ—దేవా! దేవరవారు దండనాథులచేత విదర్భరాజును లోఁబఱుచుకొని చెఱసాలనుండి విడిపించినమాధవసేనుఁ డనురాజకుమారునకుఁ జెల్లెలయినమాళవిక యీమె.

రాజు—ఏమీ! ఈమె రాజపుత్రికా? మంచిగంధపుకఱ్ఱనాచేఁ బాదుకగా నుపయోగింపఁబడి దూషిత మయినది.

రాజు—ఈమె కీదశ యెట్లు సంభవించినది?

మాళ—(నిట్టూర్పు విడిచి తనలో) విధినియోగముచేత.

ద్వితీయ—దేవరవారు వినవలెను. మా రాజకుమారుఁడయిన మాధవసేనుఁడు దాయాదునివశమునఁ జిక్కఁగా నాతని మంత్రియైన సుమతి మాకోఁటిపరిజనమును విడిచిపెట్టి యీమెను రహస్యముగాఁ దీసికొనిపోయినాఁడు.

రాజు—ఇంతవఱకు మేమీవఱకే విన్నాము. అటుతరువాత?

ద్వితీ—దేవా! అటుతరువాత జరగినది మాకుఁ దెలియదు.

పరి—అటుతరువాత జరగినది మందభాగ్యురాల నయిన నేను వినిపించెదను.

ఇద్ద—రాజపుత్రీ! ఈకంఠస్వరము పూజ్యురా లయినకౌశికిది వలె నున్నది. ఆమె కాదుగదా?

మాళ—అవును. ఆమెయే.

ఇద్ద—యతివేషధారిణియై యున్నయీమె నిశ్చ యానవాలు పట్టుటయే కష్టముగా నున్నది.—అమ్మా! నీకు నమస్కారము.

పరి—మీయిద్దఱకు శుభమగుఁగాక!

రాజు—అమ్మా! మీకు పీ రాప్తవర్గములోనివారా?

పరి—అవును.

విదూ—అట్లయిన మీరిప్పుడు పూజ్యురాలయిన యీమె వృత్తాంతము నంతను బూర్ణముగాఁ జెప్పివేయుఁడు.

పరి—(విచారముతో) అంతయు వినుఁడు. మాధవసేనుని మంత్రియైన సుమతి నా కన్నగారు. తెలిసినదా?

రాజు—తెలిసినది. అటుతరువాత?

పరి—ఈమెతోడఁబుట్టి వాఁడావిధమయి పోఁగా గూఢముగా నీమెను వెంటబెట్టుకొని తమతో సంబంధముచేయవలెనను కోరికతో నతఁడు విదిశానగరమునకు వచ్చుచున్న సార్థవాహులతో బయలు దేఱినాఁడు.

రాజు—అటుపిమ్మట?

పరి—అతఁడును దారినడిచిన వణిగ్జనమువలెనే యడవిలోఁ బ్రవేశించి విశ్రాంతి పొందుట కారంభించెను.

రాజు—ఆపయిని?

పం—ఆపయిని మఱి యేమున్నది!

ఉ. బాహులసద్యఃదూణములపట్టము లిట్టటు కట్టియుండ, ను
త్సాహముపుట్టఁ బాదములదాఁకను వ్రేలఁగ బర్హిబర్హముల్,
సాహసలీల నార్చుచును జాపములన్ ధరియించి, చోరసం
దోహము చేరుమాత్రమున దుస్సహమై కనుపట్టె నవ్వడిన్.

మాళ—(భయము కనఁబఱుచు చున్నది.)

విదూ—అమ్మా! భయపడఁబోకు. ఈమె యీవఱకు జరిగినకథనే చెప్పుచున్నది.

రాజు—తరువాత. తరువాత.

పరి—అప్పుడు బద్ధాయుధు లయిన సార్థవాహయోధులు ముహూర్తకాలములో దొంగలచేత తఱుమఁగొట్టఁబడినారు.

రాజు—అమ్మా! పాపము! ఇఁకఁ జెప్పఁబోవునది కష్టకథ కాఁబోలును!

పరి—అటుతరువాత నాసోదరుఁడు—

గీ. ఆదురాత్ములచేతఁ గీడడరు నంచు
భయపడుచు నున్నయీమెఁ గాపాడుకొఱకుఁ
దాను ప్రభుభక్తి మెఱయు దుస్త్యజము లైన
ప్రాణముల నిచ్చి తీర్చెఁ బో స్వామిఋణము.

ప్రథమ—కటకటా ! సుమతి హతుఁ డయ్యెనా?

ద్వితీయ—అందుచేతనే యీరాజపుత్రిక కిటువంటియవస్థ పట్టినది.

పరి—(కన్నుల నీరు విడుచుచున్నది.)

రాజు—అమ్మా! శరీరముల కాశ పడనివారి లోకయాత్ర యిటువంటిదే. తాను దిన్నప్రభువునన్నము సఫలము కావించుకొన్న యాపుణ్యాత్మునికొఱకు శోకింపవలసినపని లేదు.

పరి—నేనప్పుడు మూర్ఛపోయి మరలఁ దెలివి తెచ్చుకొను లోపల నీమె కంటి కగపడకపోయినది.

రాజు—అప్పు డమ్మగారు పొందినకష్టము మహత్తరమయినదయి యుండును.

పరి—అప్పుడు నేనన్నగారిశరీరమున కగ్నిసంస్కారము చేసి, మరలఁ గ్రొత్తగాఁ దోఁచినవైధవ్యదుఃఖముతోఁ గాషాయవస్త్రములను ధరించి మీ దేశమున ప్రవేశించినాను.

రాజు—సజ్జనుల కీమార్గము యుక్తమయినదే. ఆపయిని?

పరి—ఆపయి నీమె యాకిరాతులనుండి వీరసేనునివద్దకును, వీరసేనునినుండి దేవిగారియొద్దకును వచ్చినది. దేవిగారిగృహము నందు ప్రవేశము దొరకినతరువాత నాకీమె కానఁబడినది. నాకథ యింతటితో సరి.

మాళ—(తనలో) భర్త యిప్పు డేమి చెప్పునో?

రాజు—ఓహో! ఆపద లెప్పుడును బరాభవమును దెచ్చును గదా! ఎట్లనిన—

గీ. అకట! దేవి కా నర్హురా లయినయీయామె
దాసిగాఁ జేయఁబడె నింతదనుక నిందు
జిలుగుఁదెలిపట్టుపుట్టంబు తెలివిమాలి
వడిఁ దలంటుగుడ్డగఁ జేయఁబడినట్లు.

ధార—అమ్మా! మాళవిక గొప్పవంశమునఁ బుట్టిన దని యింతవఱకును జెప్పక నీవు తప్పు చేసితివి.

పరి—పాపము శమించునుగాక! నేను గారణ ముండియే యీసంగతి రహస్యముగా నుంచినాను.

ధార—ఆకారణ మేది?

పరి—ఈ మెతండ్రిజీవించి యుండఁగాఁ దీర్ఘయాత్రాపరుఁడయి సిద్ధాదేశముచేత వచ్చిన యొకసాధు వీమె సంవత్సరమాత్రము దాస్యము ననుభవించి తరువాతఁ దగినభర్తను బొందునని చెప్పెను. అది యవశ్యముగా ననుభవింపవలసినదని యెఱిఁగి మీపాదసేవతో నంతమయ్యెడి యీమెయొక్కయాకాలవధిని బ్రతీక్షించుచుంటిని. అట్లు చేయుట మంచిదనియే నేను భావించెదను.

రాజు—అట్లు ప్రతీక్షించుట మంచిపనియే.

కంచు—దేవా! విదర్భదేశవ్యవహారవిషయమునఁ జేయవలసిన దేమో ప్రభువువారియభిప్రాయము వినఁగోరుచున్నానని మంత్రి మనవిచేయు చున్నాఁడు. మీరు ప్రసంగాంతరముతో నుండుటచేత నాకు విన్నవించుట కవకాశము చిక్కినది కాదు.

రాజు—మౌద్గల్యా! అన్నదమ్ము లయిన యీయజ్ఞసేన

మాధవసేనులకు రాజ్యము రెండుభాగములుగాఁ బంచియిచ్చియిప్పుడు వారినిద్దఱిని రాజ్యమునందు నిలుపఁగోరుచున్నాను.

గీ. వరద కుత్తర దక్షిణభాగములను
వారు పాలించుకొననిమ్ము వేఱువేర
వరుసగా నలచంద్ర భాస్కరులు తాము
రేయి పగలును బాలించు రీతిగాను.

కంచు—దేవా! నేనిది మంత్రిసభకు విన్నపము చేసెదను.

రాజు—(ప్రేరితో ననుమతిని గనఁబఱుచు చున్నాఁడు.)

కంచు—(నిష్క్రమించుచున్నాఁడు.)

పరివ్రాజిక—(రహస్యముగా) ఓ రాజపుత్రీ! భాగ్యవశముచేత నీయన్నగారర్ధరాజ్యమునఁ బ్రతిష్ఠింపఁ బడుచున్నాఁడు.

మాళ—జీవితసంశయదశనుండి విడిపింపఁబడి నందునకే మనము సంతోషింప వలయును.

[కంచుకి మరలఁ బ్రవేశించు చున్నాఁడు.]

కంచు—దేవా! విజయ మగునుగాక! దేవరవారియాజ్ఞ మంగళప్రదమయిన దని మంత్రి మనవి చేయుమన్నాఁడు. మంత్రి సభవారును తామీప్రకారముగా నిశ్చయించినారు.

చ. సరిఁ గయికొన్నయాతఁ డలశ్రీని దయ న్మరలంగ నిచ్చినన్,
బరువు రథాశ్వముల్ మెడలపైని వహించెడునట్లు, దాల్చి వీ
రిరువురు నింకమీఁద నితరేతర వైరము మాని, యోనరే
శ్వర ! భవదీయశాసనముఁబట్టి మెలంగుచు నుందు రెప్పుడున్,

రాజు—అట్లయినపక్షమున సేనానియైనవీరసేనున కీవిధము గా జేయుమని లేఖ వ్రాసి పంపవలసినదని మంత్రిసభకుఁ జెప్పు.

కంచు—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను. (అని వెడలి

పోయి, ఒకలేఖయుఁ గానుకయుఁ బట్టుకొని మరలఁ బ్రవేశించు చున్నాఁడు) ప్రభువుగారియాజ్ఞ జరపఁబడినది. ఇదిగో సేనాపతి యైనపుష్పమిత్రునియొద్దనుండి బహుమానముగాఁ బంపఁబడినయుత్తరీయముతోఁగూడ నీలేఖ వచ్చినది. ప్రభువారు దీనిని జిత్తగింతురు గాక!

రాజు—(లేచి, బహుమానము నుపచార పూర్వకముగా గ్రహించి, పరిజనముచేతి కిచ్చి, లేఖను విప్పుచున్నాఁడు)

ధార—ఆహా! నామన స్సాలేఖమీఁదనే యున్నది. గురుజనక్షేమము తెలిసికొన్నపిమ్మట వసుమిత్రుని వృత్తాంతము వినెదను. సేనాపతి నాపుత్రునిమీఁద నతిభారమును మోపినాఁడు.

రాజు—(కూరుచుండి చదువు చున్నాఁడు) శ్రీరస్తు! విదిశానగరమునందున్న చిరంజీవి యైనమాపుత్రుఁ డగునగ్నిమిత్రుని సేనాపతి యైనపుష్పమిత్రుఁడు ప్రేమపూర్వకముగా నాలింగనము చేసికొని యజ్ఞశాలనుండి పుత్తెంచిన పత్రిక. నేను రాజసూయజ్ఞదీక్షితుఁడనయి యుండి నూఱువురు రాజపుత్రులను దోడిచ్చి మనవసుమిత్రునిఁ దురంగరక్షణార్థము సంవత్సరముక్రిందటని యోగించి తనమనసువచ్చినట్లుగా సంచరించుట కయి గుఱ్ఱమును విడిచిపెట్టితిని. అది సింధునది దక్షిణతీరమునఁ దిరుగుచుండఁగా దాని నశ్వసేనాధిపతి యైన యొకయవనుఁడు పట్టుకొనెను. అప్పు డుభయసేనలకును ఘోరయుద్ధము సంభవించెనని తెలియునది.

ధార—(విషాదమును గనఁబఱుచుచున్నది)

రాజు—ఏమీ! ఈవిధముగా జరగినదా?

"గీ. అతులధన్వి యౌా వసుమిత్రుఁ డడరి యుద్ధ

చెదరఁగాఁ దోలి శత్రుల సిగ్గుపఱిచి

వడిగ నాయుత్తమాశ్వంబు బలిమితోడఁ
దాను మరలించి తెచ్చె నిత్తావునకును."

ధార—ఈ వాక్యముచేత నాహృదయము చల్లపడినది.

రాజు—(మిగిలిన లేఖను జదువు చున్నాఁడు) అంశుమంతుఁడు సగరున కశ్వమును దెచ్చి యిచ్చినట్లుగా నాపౌత్రుఁడు నాకు యజ్ఞాశ్వమును దీసికొనిరాఁగా నేనిప్పుడు చేయఁ బూనినయీయజ్ఞమునకు రోషము విడిచి నీవు వధూజనసహితముగా యుక్తసమయమున రావలెను.

రాజు—నా కిది యనుగ్రహము.

పరి—భాగ్యవశమునఁ బుత్రవిజయముచేత దంపతులు వర్ధిల్లు చున్నారు. (ధారణివంకఁ జూచి)

గీ. భర్తచేతను దగ వీరపత్నులందుఁ
బ్రథమగణ్యవై శ్లాఘ్యతఁ బడసితీవు;
మఱియు నిప్పుడు నీదుకుమారువలన
వీరమాతవునైతి వోవెలఁదిమిన్న.

ధార—అమ్మా! కొడుకు తండ్రినిబోలినవాఁ డయినందుల కానందభరితురాలనయినాను.

రాజు—మాద్గల్యా! ఏనుఁగుపిల్ల యూథపతి ననుకరించినది సుమా.

కంచు—గీ. అంబువులఁ బీల్చునగ్నికి నౌర్వనట్ల
జననకారణ మీవైనఘనత చేత
నితని వీరవిచేష్టిత మేము చూచి
డెందమున విస్మయంబును బొందమిందు.

రాజు—మౌద్గల్యా! చెఱసాలలోనున్న యజ్ఞసేనునిమఱంది మొదలయినవారినందఱిని విడుదల చేయింపుము.

కంచు—దేవరవారానతిచ్చినట్లు చేయించెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

ధార—జయసేనా! నీవు పోయి యిరావతి మొదలయిన యంతఃపురకాంతల కందఱికిని నాపుత్రునివిజయవార్తను దెలుపుము.

ప్రతీ—ఆలాగునఁ జేసెదను. (అని బయలుదేఱుచున్నది.)

ధార—కొంచెము మరలుమమ్మా.

ప్రతీ—(వెనుకమరలి) ఇదిగో వచ్చినాను.

ధార—(రహస్యముగా) నేనశోకదోహదమునకు నియోగించినప్పుడు మాళవికకుఁ జేసిన నాప్రతిజ్ఞను, ఆ మెసవ్వాంశసంభవతయుఁ జెప్పి, నాసత్యము నీమూలమునసిలువవలెనని యిరావతిని నామాటలుగా నూఱడింపుము.

ప్రతీ—దేవియాజ్ఞాపించినట్లు చేసెదను. (అని వెడలిపోయి మరలఁ బ్రవేశించి) అమ్మా! నీపుత్రవిజయనిమిత్తమున సంతోషించి యంతఃపురకాంత లిచ్చినయాభరణములకు నేను బెట్టెనయినాను.

ధార—చాలును. ఇందాశ్చర్యమేమున్నది? ఈయభ్యుదయము నాకును వారికిని సామాన్యమయినదే.

ప్రతీ—(రహస్యముగా) అమ్మా! "పెద్దవారయిన మీనోటినుండి వచ్చినమాట యోగ్యమయినది. మీసంకల్పమును మార్చుకొనుట యుక్తముకాదు" అని యిరావతి మనవిచేయుచున్నది.

ధార—అమ్మా! ప్రథమమునఁ బూజ్యుఁడయిన సుమతిచేత నియ్యసంకల్పింపఁబడిన యీమాళవికలు భర్తగారి కిచ్చుటకయి మీయనుమతమును గోరుచున్నాను.

పరి—ఇప్పుడు సహితము నీవే యీమెకు యజమానురాలవు.

ధార—(మాళవికను జేతితోఁబట్టుకొని) నాకుఁబ్రియువార్తను దెలిపినందుకయి భర్తగా రీమెను బారితోషికముగా నంగీకరింతురు గాక!

రాజు—(సిగ్గుపడుచున్నాఁడు.)

ధార—(చిఱునవ్వుతో) చేసినప్రియనివేదనమునకీపారితోషికము తగదని భర్తగారు తిరస్కరించుచున్నారా యేమి?

విదూ—అమ్మా! క్రొత్తపెండ్లికొడుకు లందఱును లజ్జపడుదు రన్న లోకప్రవాదము విన్నదేకదా?

రాజు—(విదూషకునివంకఁ జూచుచున్నాఁడు.)

విదూ—దేవిగారే యీమెకుఁ దమతో సమానముగా దేవీసంజ్ఞ నిచ్చినతరువాతనే యీయన మాళవికను బ్రతిగ్రహింపఁగోరుచున్నాఁడు.

ధార—దేవీనామము రాజపుత్రికయైన యీమెకు సత్కులోద్భవత్వముచేతనే యియ్యఁబడినది. పునరుక్తిచే నేమిప్రయోజనము?

పరి—అట్లు కాదు.

క. గనిలోఁ బుట్టిన దయ్యును,
నొనరంగా సానఁబట్టుకున్నను మణియున్
గనకముతో సంయోగం
బొనఁగూర్పఁగ నర్హమౌనె? యోకళ్యాణీ!

ధార—అమ్మా! ఈ యభ్యుదయకథచేత మొదట నీమె మేలిముసుఁగు సంగతిచూడలేదు క్షమింపుము. నీవు పోయి మేలిముసుఁగునకయి పట్టువస్త్రమును దీసికొనిరమ్మా.

ప్రతీ— దేవిగారాజ్ఞాపించినట్లు చేసెదను. (అనిపోయి ముసుఁగుచీరను దీసికొని మరలఁ బ్రవేశించి) దేవీ! ఇదిగో.

(అని యిచ్చుచున్నది.)

ధార—(మాళవికకు ముసుఁగువేసి) ప్రాణేశ్వరా! ఈమెను బ్రతిగ్రహింపవలెను.

రాజు—నేను నీశాసనమును మీఱరాదుగనుక నీదానమును స్వీకరించినాఁడను.

విదూ—ఆహా! ఏమి యీధారణీదేవి యనుకూలత!

ధార—(పరిజనమువంకఁ జూచుచున్నది.)

పరిజనము—(మాళవికనుసమీపించి) అమ్మా! జయమగుఁగాక! జయమగుఁగాక!

ధార—(పరివ్రాజికవంక జూచుచున్నది.)

పరి—దేవీ! ఇది నీకు వింతకాదు.

గీ. పతులసేవింత్రు ప్రతిపక్షసతుల నిచ్చి
యైనఁ బతిభక్తితత్పర లైనసతులు,
నదు లనేకములగు నేటియుదకములను
గొంచుఁ బోయి సముద్రునిఁ గూర్చునట్లు.

[నిపుణిక ప్రవేశించుచున్నది.]

నిపు—దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! "అప్పుడుపచారాతిక్రమణముచేత నేను భర్తగారియెడ నపరాధము చేసినాను. అయినను నేనటుతరువాత భర్తగారికి స్వయముగానే యానుకూల్యమును జేసినాను. ఇప్పుడు భర్తగారు సంపూర్ణమనోరథులయినారుగనుక, నన్నుఁగూడఁ బ్రసాదమాత్రముచేత సంభావింపఁదగును." అని యిరావతి విన్నపముచేయుమన్నది.

ధార—నిపుణికా! "భర్తగారు నీవుచేసినసేవకుఁ దగిన ఫలమును బ్రసాదింతురు" అని యిరావతితోఁ జెప్పుము.

నిపు—నాకిది పరమానుగ్రహము.

(అని నిష్క్రమించుచున్నది.)

పరి—దేవా! మీతోడివిడువని సంబంధముచేతఁ గృతార్థుఁడయిన మాధవసేనునిఁ దమసెలవుమీఁదఁబోయి సందర్శించి నేత్రసాఫల్యమును బొందఁగోరుచున్నాను.

ధార—అమ్మా! మీరు మమ్మువిడిచిపెట్టుట తగదు.

రాజు—అమ్మా! నీక్షేమవార్తను మాలేఖలలో లిఖించి యాతనితావునకు మాసభాజనులను బంపెదను.

పరి—మీయిరువుర యాదరముచేతను నేను ధన్యురాలనయినాను.

ధార—ప్రాణేశ్వరా! నేనింకను దమకేమి చేయవలెనో యాజ్ఞాపింపుఁడు.

రాజు—నాకిదియే ప్రియము.

ఉ. దేవి! ప్రసన్నురాలవయితి దియ్యముచూపు సతంబునాపయిన్;
నే వచియింతు విన్న్యదియు నీప్రతిపక్షజనంబుఁబట్టి యో
పావని! యగ్నిమిత్రుఁ డిల పాలనచేసెడు నంతకాలమున్
భూవలయంబునం బ్రజకుఁ బుట్టకయుండుత మీతిబాధలున్.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

సంపూర్ణము

శ్రీ

ప్రబోధచంద్రోదయము.

ఇది

కృష్ణమిశ్ర విరచితమైన సంస్కృత నాటకమునుండి

గద్య పద్యాత్మకముగా

కందుకూరి వీరేశలింగము పంతులుచే

తెనిఁగింపఁబడినది.

నాల్గవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీసమాజము

రాజమహేంద్రవరము

1950

రాజమహేంద్రవరమున
టాక్సు ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.

ఈ నాటకమునందు వచ్చు పాత్రములు.

వివేకుఁడు—కథానాయకుఁడగు రాజు. మనస్సునకు నివృత్తిదేవి వలనఁ బుట్టినవాఁడు.

వస్తువిచారుఁడు, సంతోషుఁడు—వివేకుని సేనానాయకులు.

మనస్సు—వివేకునికిని; మహామోహునికిని తండ్రి.

క్షమ—వివేకుని, సేనానాయకురాలు.

మతి—వివేకుని భార్య.

ఉపనిషద్దేవి—వివేకుని భార్య.

శ్రద్ధ—శాంతియొక్క తల్లి.

శాంతి, కరుణ, మైత్రి—వివేకునిపక్షమునఁ బనిచేయుపరిచారికలు.

సంకల్పుఁడు—మనస్సు కొడుకు.

వైరాగ్యుఁడు—మనస్సు కొడుకు.

ప్రబోధచంద్రుఁడు—వివేకుని కుపనిషద్దేవివలనఁ బుట్టినపుత్రుఁడు.

విద్య—వివేకున కుపనిషద్దేవివలనఁ బుట్టినకూఁతురు.

సరస్వతి—విష్ణుభక్తిదేవి యాజ్ఞవలనమనస్సునోదార్పవచ్చిన దేవత.

విష్ణుభక్తి—వివేకుని యిష్టదేవత.

పురుషుఁడు—జీవుఁడు.

మహామోహుఁడు—ప్రతినాయకుఁడు. మనస్సునకు ప్రవృత్తిదేవి వలనఁ బుట్టినవాఁడు.

కాముఁడు, క్రోధుఁడు, లోభుఁడు—మహామోహుని సేనానాయకులు.

రతి—కాముని భార్య.

హింస—క్రోధుని భార్య.

తృష్ణ—లోభుని భార్య.
దంభుఁడు—లోభుని కొడుకు.
అహంకారుఁడు—లోభుని తండ్రి.
నాస్తికత—మహామోహుని భోగభార్య.
అసత్సంగుఁడు—మహామోహుని భృత్యుఁడు.
వటుఁడు—దంభుని శిష్యుఁడు.
చార్వాకుఁడు, దిగంబరసిద్ధాంతుఁడు, బుద్ధాగముఁడు, సోమసిద్ధాంతుఁడు—మహామోహుని పరివారములోనివారు.
నిదిధ్యాసనుడు—విష్ణుభక్తిదేవి యుపనిషద్దేవికడకుఁ బంపినదూత.

వీరుగాక ప్రస్తావనమునం దనేకపురుషులును స్త్రీలును వత్తురు.

ఉపోద్ఘాతము

ఈనాటక మేకాలమునందు రచియింపఁబడినదో నిశ్చయముగాఁ దెలిసికొనుట కాధారము లేవియుఁ గానరావు. గ్రంథకర్తయైన కృష్ణమిశ్రుఁడు షష్ఠాంకమునందుఁ గుమారిల భట్టుయొక్క పేరు నుదాహరించుటచే నిది యాతని కాలమునకుఁ దరువాతదగుట నిశ్చయము. కుమారిలభట్టు క్రీస్తుశక మేడవ శతాబ్ద మధ్యమునందుండి, పూర్వమీమాంసారి క్తము మొదలయిన గ్రంథములను రచియించి, బౌద్ధమతమును భంజించుటకయి మహాప్రయత్నముచేసి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈనాటకముయొక్క యుద్దేశ మద్వైతమును స్థాపించుటయే యయినను, ఇందెందును దన్మత స్థాపకుఁడయిన శంకరాచార్యులవారిపే రుదాహరింపఁబడి యుండలేదు. శంకరాచార్యులవారు హూణశకము ౭౮౮ వ సంవత్సరమునందుఁబుట్టి తొమ్మిదవశతాబ్దారంభమునఁ బ్రబలియున్నారని యిప్పు డించుమించుగా నిశ్చయింపఁబడినది. కాఁబట్టి యీనాటకము క్రీస్తుశక మేడవ శతాబ్దమునకును తొమ్మిదవ శతాబ్దమునకును మధ్యను జేయఁబడినదని చెప్పవచ్చును. మఱియును శంకరాచార్యుని కాలమునందు మండనమిశ్రుఁడు మొదలైన మిశ్రజాతి బ్రాహ్మణు లనేకులు మహావిద్వాంసులగుటయు, గ్రంథకర్త మిశ్రజాతివాఁ డగుటయుఁగూడ కాలనిర్ణయమునకుఁ గొంత తోడుపడుచున్నది. అంతేగాక యీనాటకమును కీర్తివర్మ యను రాజుసమ్ముఖమునఁ బ్రయోగించినట్టు ప్రస్తావనవలనఁ దెలియవచ్చుచున్నది. కీర్తివర్మ యను చాళుక్యరాజొకఁడు హూణశకము ౭౮౭ వ సంవత్సరము మొదలుకొని ౭౯౭ వ సంవత్సరమువఱకును కళ్యాణి నగరమునందు రాజ్యముచేసి యున్నాఁడు. నాటకప్రస్తావన

యం దుదాహరింపఁబడిన కీర్తివర్మయితఁడే యయినపక్షమున, ఈ ప్రబోధచంద్రోదయనాటకము సంస్కృతమున హూణశకము ౭౩౭, ౭౪౭ సంవత్సరములమధ్యను రచియింపఁబడి యుండును. కాశికా పురమును రాధాపురమును వర్ణించుటచేతఁ గవి వంగదేశపువాఁ డయినట్టు కానఁబడుచున్నను, ఈనాటకము దక్షిణహిందూదేశము నందే విస్తారముగా వ్యాపించియుండుటచేతను నాటకమునం దక్క డక్కడ దక్షిణ హిందూస్థానమును గూర్చిన ప్రస్తావన కానఁబడు చుండుటచేతను గ్రంథకర్త కళ్యాణ నగరమునందే యుండి యచ్చ టనే గ్రంథరచన చేసిన ట్లూహింపవలసి యున్నది. ఈనాటకము హూణశకము ౧౩౮౭ వ సంవత్సరమునకుఁ దరువాతను ౧౪౦౮ వ సంవత్సరమునకుఁ బూర్వమునందును నంది సింగయ్య గంట మల్లయ్య యను కవులచేఁ దెనుఁగున ప్రబంధరూపమున నయిదాశ్వాసముల పద్యకావ్యముగా రచియింపఁబడినది. కాఁబట్టి నాటకము పదునేనవ శతాబ్దాంతమునకే మిక్కిలి ప్రసిద్ధమయి యప్పటికే మిక్కిలి పురా తనమైనదిగాఁ గానఁబడుచున్నది.

నేనీనాటకమును ౧౮౮౯ వ సంవత్సరమునందుఁ గొంత తెనిఁగించి యందలి ప్రథమాంకము నాసంవత్సరమునందు వివేకవర్ధ నిలోఁ బ్రకటించితినిగాని యప్పుడు కొన్ని కారణములచేత గ్రంథ మును ముగింపక యిటీవల నామిత్రులు కొంద ఱీనాటకమును శీఘ్ర ముగా ముగించి ప్రచురించవలసినదని నాకు వ్రాయుచువచ్చుటచేత గతసంవత్సరమునందు మరల నారంభించి చింతామణిపత్రిక కప్పు డప్పుడు వ్రాసి గ్రంథమును నేటికి ముగించినాను. ఈభాషాంతరము యొక్క యోగ్యతాయోగ్యతలను దీనిం జదువువారే నిర్ణయింప నర్హులుగాన నేనావిషయమునుగూర్చి యిచ్చట వ్రాయవలసిన పని

లేదు. భాషాంతరమునందును సాధ్యమైనంతవఱకు మూలగ్రంథానుసారముగానే చేసి యున్నాను. * * *

ఈనాటకమునందలి కథ వేదాంతవిషయమే యయినను కృష్ణమిశ్రుఁడు దీనిని హృదయరంజకముగాను, సుబోధకముగాను; జేసి యున్నాఁడు. ఇందు వివేకము (జ్ఞానము) నకును మహామోహము (అజ్ఞానము) నకును పోరాటము జరగఁగా మొదల నజ్ఞానమే ప్రబలముగానున్నను గడపట జ్ఞానముచేతఁ బరాజితమయి యడఁగిపోయి నట్లు చెప్పఁబడినది. ఇందు సుగుణ దుర్గుణములు పురుషులుగాను స్త్రీలుగాను జెప్పఁబడి యాయాపక్షములయందు వానివాని ప్రభావముతో మిక్కిలి మనోహరముగా వర్ణింపఁబడినవి. ఈవిషయమిందలికథను జదివినను పాత్రములను బరిశీలించినను బోధపడును గాన నేనీవిషయమును బెంచి వ్రాయక, ఈనాటకము నాంధ్రీకరించుటలోఁ గలిగిన నాప్రమాదములను దీనింజదువువారు మన్నింతురని వేఁడుచు నీయుపోద్ఘాతమును ముగించుచున్నాను.

రాజమహేంద్రవరము.
ది ౨౨ జూన్ ౧౮౯౨ వ సం॥ } కందుకూరి వీరేశలింగము.

రెండవకూర్పు.

మొదటికూర్పునఁ బ్రస్తావనలో గోపాలునిగూర్చి మార్చిన విషయ మీకూర్పున మూలగ్రంథానుసారముగా సంస్కరింపబడినది.

చెన్నపురి.
10—10—98. } కం-వీ

శ్రీ

ప్రబోధచంద్రోదయము

ప్రథమాంకము.

మ. రవిరస్మిన్ దినమధ్యమందు జలపూరంబుల్ బలెన్ దృష్టికిన్
భువి నజ్ఞానముచేత భౌతికజగంబుల్ దేనఁ దోఁచుం దగన్,
బువుదండన్ ఫణియన్నభ్రాంతివలెఁ బోవున్ దేనఁ బ్రాజ్ఞాళి క
య్యవి, యానిర్మలబోధముందలఁతు సాంద్రానందమున్ మన్మదిన్.

ఉ. నిండుమనంబు శాంతిఁ గన నేర్చినయప్పుడు బ్రహ్మరంధ్రమం
దుండి సుషుమ్నరుద్ధపవనోద్గతమై సుఖసాంద్ర మౌచు ను
ద్దండలలాటనేత్రమిషఁ దాఁ బ్రకటీకృత మైనయట్లు బ్ర
హ్మాండమునిండు నీశ్వరుచిదాత్మక తేజము మిమ్ముఁ బ్రోచుతన్.

(నాంద్యంతమున.)

సూత్రధారుఁడు—అతివిస్తార మేల? చాలును. సకలసామంతచక్రచూడామణిమరీచిమంజరీనీరాజితచరణరాజీవుండును, బలవదహితనివహావత్స్తటకవాటపాటనప్రకటితనరసింహరూపుండును, ప్రబలతరనరపతికులప్రళయమహార్ణవమగ్నమేదినీసముద్ధరణమహావరాహుండును, నిఖిలదిగ్విలాసినికర్ణపూరీకృతకీర్తిలతాపల్లవుండును, సమస్తాశాస్తంబేరమకర్ణతాలాస్ఫాలనబహుళతరపవనసంపాతనర్తితప్రతాపానలుండును, నగుగోపాలుండు—“మాకు సహజసుహృదు లైన

శ్రీకీర్తివర్మమహారాజులవారిదిగ్విజయవ్యాపారము చేత బ్రహ్మానంద రసానుభవమును కెడము లేక మేము వివిధవిషయములందగిలి వ్యర్థముగా దినములు గడపినారము. అయినను మేమిప్పుడు కృతకృత్యులమైనారము.

గీ. క్షయము నొందిరి క్ష్మావిభు శత్రునృపులు;
మహి సురక్షిత యయ్యె సన్మంత్రిగరిమ;
రాజమకుటార్చితాచ్ఛసామ్రాజ్యలక్ష్మి
యబ్ధిమేఖలయగుక్షితి నతనిఁ జేరె.

అందుచేత మేము శాంతరసప్రధాన మయిన ప్రయోగాభినయముచేత మనస్సును వినోదపెట్టఁ గోరుచున్నాము. కాఁబట్టి యింతకుఁబూర్వమే పూజ్యు లయినకృష్ణమిశ్రులవారు రచియించి మాకు సమర్పించిన ప్రబోధచంద్రోదయ మనునాటకము మీరిప్పుడు శ్రీ కీర్తివర్మమహారాజులవారి సన్నిధానమందుఁ బ్రయోగింపవలెను. రాజుగారికిని సభవారితోఁగలిసి దానినిజూడవలెనని వేడుకగలదు.''_ అని నాతో సెలవిచ్చెను. అవుఁగాక! నేనింటికిఁబోయి నాగృహిణిని బిలుచుకొనివచ్చి సంగీతకర్మమున కుపక్రమించెదను. (అని కొంచెము తిరిగి తెరవంకఁ జూచి) ఓసీ! ఇటు రమ్ము.

నటి—(ప్రవేశించి) ఇదిగోవచ్చినదానను. నే నేనియోగము ననుష్ఠింపవలెనో దేవరవారు సెలవియ్యవలెను.

సూత్ర—ఓసీ! నీకును దెలిసియే యున్నది.

మ. కలఁడుద్యద్రిపుభూరిపృతనాకాంతారమూర్ఛత్ప్రతా
పలసత్పావకకీలికాక్రమితవిశ్వవ్రాతుఁ డాశాంతని
శ్చలవిశ్రాంతయశుండు ఖడ్గతికాసంభిన్నకఁటారి రా
ట్కులభూస్థాపితకీర్తివర్ముఁడు తగన్ గోపాలుఁ డుర్వీస్థలిన్.

మఱియును,

మ. రణరంగస్థలు లిప్పుడున్ మనుజభుగ్గ్రామాంకరాస్ఫాలనో
ల్బణవల్గన్నృకపాలతాళరవము ల్వ్యాపింప, ఝుంఝూసమీ
రణసంక్షోభితకుంభికుంభకుహర ప్రవ్యక్తనాదంబులన్
బ్రణుతింపం దదపూర్వకీర్తుల, నటింపంగాఁ బిశాచాంగనల్.

ఆతఁ డిప్పుడు శాంతపదస్థితుఁడయి యాత్మవినోదార్థముగాఁ బ్రబోధచంద్రోదయనాటక మాడవలెనని యాజ్ఞాపించియున్నాఁడు. నటుల నిప్పుడు వేషములు ధరించి వచ్చునట్లు నియమింపవలెను.

నటి—(విస్మయముతో) ఆర్యపుత్రా! ఆశ్చర్యము! ఆశ్చర్యము! ఇట్లు నిజభుజబలవిక్రమైకనిర్భర్త్సితసకలరాజమండలుండైన యతం డాకర్ణాకృష్టకఠినకోదండదండ బహుళవర్షచ్ఛురనికరజర్ఝరీకృతతురంగతరంగసందోహంబును నిరంతరనిపతత్తీక్ష్ణనిశితశస్త్రసహస్రపర్యస్తోత్తుంగమాతంగమహామహీధ్రసహస్రంబును భ్రమదుద్భుజదండచండమందరాభిఘాతఘూర్ణత్సకలపదాతి సలిలసంఘాతంబును నగు కర్ణసైన్యసాగరంబును మధుమథనుండు క్షీరపారావారంబును బోలె నిర్మథించి సమరవిజయలక్ష్మిం జేకొని వీరచరితుండై యిప్పుడిటువంటి సకలమునిజనశ్లాఘనీయమైన యుపశమ మెట్లు వొందెను!

సూత్ర—ఓసీ! బ్రహ్మజ్యోతి యెప్పుడును స్వభావముచేత సౌమ్యమయినదే. అయినను, అది యేకో కారణముచేత వికారమును బొందినను మరల స్వభావమునందే నిలుచును. ఆప్రకారముగానే సకలభూపాలకులప్రళయకాలాగ్నిరుద్రుఁడైన చేదిపతిచేత నున్మూలింపఁబడిన చంద్రాన్వయపార్థివపృథ్వీరాజ్యమును స్థిరీకరించుటకయి యీయనకీసంరంభము కలిగినది. చూడుము—

గీ. ప్రళయకాలసముద్భూత వాయువశతఁ
బర్వతంబుల లంఘించువారిరాశి
నిశ్చలంబయి స్వచ్ఛమై నిలువ లేదె
యిపుడు మేరమీఱక స్వభావేద్ధగరిమ?

అంతేకాక శ్రీమన్నారాయణాంశసంభూతులయిన యిటువంటి పౌరుషభూషణు లగు పురుషులు భూతహితముకొఱకై భూమియందు నవతరించి విహితకృత్యములను నిర్వహించి మరల శాంతిని బొందుదురు. ఇప్పుడు పరశురాముని కథ వినుము—

మహాస్రగ్ధర

ఎవఁ డీధాత్రీస్థలిన్ మూఁట నృపులఁ గెడపి ముయ్యేడునూఱుల్ ద్వీపన్నాం
నవసామ స్తిష్క పంకాచ్ఛ రుధిర నదులన్ స్నానముం జేసెఁ; జేదో
యివధిం చెన్నిర్దయుండై యెవఁడువనితలన్ వృద్ధులన్ బాలురన్ మా
నవపాలాంచద్భుజాఖండనచణగుణసందత్కుఠారోగ్రధారన్.

గీ. అట్టి జామదగ్న్యుఁడు స్వవీర్యమున భూమి
భారమునుడించి, నృపకులాన్వయముఁ ద్రుంచి,
గోపపావకు నాపయి రూపడంచి,
తపముబలిమిని బరమశాంతత వహించె.

ఆలాగుననే యితండును గర్తవ్యమును నెఱపి యిప్పుడు పరమోపశమనిష్ఠుఁ డయి యున్నవాఁడు.

గీ. పుడమిపైని వివేకుండు మోహజయముఁ
బడయునట్లుగఁ గర్ణుని వడిజయించి
యల ప్రబోధునకుంబలె నభ్యుదయము
నితఁడు శ్రీకీర్తివర్మభూపతికి నొసఁగె.

[తెరలో]

ఓరీ! పాపీ! నటాధమా! ఏమిరా? నా దేహములోఁ బ్రాణములుండఁగానే మాస్వామియైన మహామోహునకు వివేకునివలనఁ బరాజయము నుదాహరించుచున్నావు!

సూత్ర—(తొట్రుపాటుతోఁ జూచి) ఓసీ! చూడు.

చ. మదనుఁడు వచ్చె నిచ్చటికి మంజులవీనకుచద్వయంబు పే
రెద ఘటించుచున్ రతి రహిన్ బులకాంచితబాహువల్లులన్
గదిసి కవుంగిటం బొదువగా, మదఘూర్ణితనేత్రపద్ముఁడై
యదె నయనాభిరామసుభగాకృతి లోకము మోహపెట్టుచున్.

అతఁడు నామాటలవలనఁ బుట్టిన క్రోధము మూర్తిభవించినట్లు కనఁబడుచున్నాఁడు. ఇక్కడనుండి మన మతనిని విడిచి పాఱిపోవుటయే శ్రేయము.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు)

ఇది ప్రస్తావన

[వెనుకఁ జెప్పినరీతిని కాముఁడును, రతీదేవియుఁ,
ప్రవేశించుచున్నారు]

కాము—(కోపముతో) ఓరీ! పాపీ! నటాధమా! ఏమిరా! నా బొందిలోఁ బ్రాణము లుండఁగానే మాస్వామియైన మహామోహునకు వివేకునివలనఁ బరాజయము నుదాహరించుచున్నావు! ఔరా! భరతాధమా!

గీ. పృథివి నిందీవరాక్షులదృష్టివిశిఖ
సంతతులు పర్వకుండెడు నంతవఱకె
మహితవిద్వాంసులకునైన మనసులందు
శాస్త్రజన్యవివేకంబు సంభవిల్లు.

ఉ. సుందరమందిరంబులును, సోయగపుంజవరాంగ్రుడు, షట్పదా
మందరవోల్లసల్లతలు, మల్లెలతావుల నొప్పుగాడ్పులున్,
జందురుఁడున్న రేలుఁ, నెటవాకు నమోఘబలంబులౌట గె
ల్పొందఁగ, నవ్వివేకుఁడెటులుండుఁ? బ్రబోధుఁడు నెట్లుపుట్టెడున్?

రతి—ఓప్రాణేశ్వరా! మహామోహ మహారాజుగారి శత్రు వయిన వివేకుఁడు సామాన్యుఁడు కాఁడని తలఁచుచున్నాను.

కామ—ఓప్రియురాలా! స్త్రీ స్వభావముచేత వచ్చిన పిఱికి తనము బయలఁ బడునట్లుగా, నీ వావివేకున కేలభయపడెదవు? చూడు.

క. శరములు విల్లును నా కో
సరసిజముఖ! పూలెయైన, తృణమేన్ ననురా
సురమగు సర్వజగంబును
దెరలక నాయాజ్ఞమీఱి ధృతి నిల్చెడునే?

చ. సురపతి జాతరం గలసెనుమ్మి యహల్యను, బ్రహ్మదేవుఁడున్
వరతనయ న్వరించె, గురుపత్నినిగూడి రమించెఁ జంద్రుఁడున్;
బరుఁడిఁకఁ గానిమార్గమును బట్టనిపాఁడెవఁ డస్మదాజ్ఞచే?
నరయ మతేవి మచ్చరములట్లు భ్రమింపఁగఁజేయు లోకమున్?

రతి—ఓప్రాణేశ్వరా! అదియంతయు సత్యమేకాని, శత్రుఁడు సహాయసంపన్నుఁడు గనుక శంకింపవలసి యున్నది. యమ నియమ ప్రముఖు లయిన యాతని మంత్రులు మహాబలవంతు లని విను చున్నాను.

కామ—ఓప్రియురాలా! నీవొక్కబలవంతుఁ డయిన యా వివేకమహారాజుయొక్క యమాదిమంత్రులనే తలఁపున నిలుపు చున్నావుకాని మమ్ము విచారింపకున్నావు. మేము పూనికతోఁ దార

సించినంతమాత్రముచేతనే వారందఱును నిమిషములోఁ జెల్లాచెదరగుదురు సుమా!

గీ. ఇచటిక్రోధునియెదుర నహింస యెంత?
బ్రహ్మచర్యాదు లెంత నాపజ్జఁ జూడ?
వినుము సత్యంబు నస్తేయుఁడు నపరిగ్ర
హుండు నెంతవా రాలోభునొద్దఁ జెపుమ.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులు నిర్వికారచిత్తులకడనేకాని యుండరుగాన వారిని సులభముగానే నశింపఁజేయవచ్చును. అంతేకాక వారిపాలిటిమృత్యుదేవతలైనస్త్రీలను నాకధీనురాండ్రయి మెలఁగు చున్నారు.

ఉ. వారివిలోకనంబులును వారిసుభాషణముల్ విలాసమున్.
వారల కౌఁగిలింతలును వారలహాసముఁ గ్రీడ లేల? య
వ్వారలనామస్మరణభాగ్యమె చాలు హృదంతరంబులం
దారయ నిర్వికారులకు నైన వికారము పుట్టఁజేయఁగన్.

విశేషించి వీరు మనప్రభువువారి యాప్త లయిన మద, మాత్సర్య, డంబాదులకు లోఁబడినవారయి మనరాజుగారి మంత్రియైన యధర్మునినే యాశ్రయింతురు.

రతి—ఓహృదయేశ్వరా! మీకును శమ, దమ, వివేకప్రభృతులకును జన్మస్థల మొక్కటియే యని విన్నదానను.

కాము—ఓహో! ప్రియురాలా! ఒక్కజన్మస్థలమే యేకమని చెప్ప నేల? మాకు జనకుఁడును నొక్కఁడే సుమా! ఎట్లన—

ఉ. ఈశ్వరసంగమంబునను నెంతయుఁ బొల్తను మాయయందు నీ
విశ్వములో మనస్సనెడువిశ్రుతుఁ డౌ సుతుఁ డుద్భవిల్లె; నా

యీశ్వరసూతియే మొదట నెల్లజగమ్ములుఁ జేసి మీఁదటన్
శాశ్వతకర్త యయ్యెను బొసంగఁ గులంబులు మావిరెంటికిన్.

అతనికిఁ బ్రవృత్తియుఁ, నివృత్తియు, నని యిద్దఱు ధర్మపత్నులు గలరు. వారితోఁ బ్రవృత్తివలన మహామోహుఁడు మూలపురుషుఁడుగాఁగల మావంశము పుట్టినది. నివృత్తివలన వివేకుఁడు మూలపురుషుఁడుగాఁగల యీరెండవవంశము పుట్టినది.

రతి—ఓప్రాణనాయకా ! అట్లయిన సహోదరులయ్యును మీలోమీకిటువంటి పరస్పర విరోధమెందుకు ?

కాము—

మ. ఇలనేకామిషసంభవత్వముననే యెందు న్మహావైరముల్
పెలుచ న్వర్ధిలు నన్నదమ్ములకుఁ; బృథ్వి న్వింతయే యీగతుల్!
కలుగన్ లేదె జనక్షయంబయినసంగ్రామంబు మున్నీమహీ
స్థలిలోఁ బాండవకౌరవోత్తములకున్ ధాత్రీనిమిత్తంబునన్!

ఈజగత్తుసర్వమును మాపిత్రార్జితము. జనకునకు మాయందుఁ బక్షపాతముచేత జగత్తంతయు మేమాక్రమించుకొనఁగా, నిలువలేక యుదాయదలై నతనవారితో వివేకుఁ డందందుఁ దిరుగుచు నెక్కడనో యడఁగియున్నాఁడు. ఇప్పుడాపాపాత్ము లందుచేతఁ దండ్రిని మమ్మును గూడ నిర్మూలము చేయుట కుద్యోగించుకొని యున్నారు.

రతి—పాపము శాంతించునుగాక ! పాపము శాంతించునుగాక! ఓ ప్రాణేశ్వరా! విద్వేషమాత్రముచేతనే వారిప్పుడీ పాపవ్యవసాయమునకుఁ బూనినారా? లేక యిప్పుడు వారాలోచించిన యుపాయ మేదియైనఁగలదా?

కాము—దీనికిఁ గొంచెము గూఢకారణమున్నది.

రతి—ఓ ప్రాణేశ్వరా ! అది నాకేలచెప్పరు ?

కాము—నీవు స్త్రీస్వభావముచేతఁ బిఱికిదానవని నీ కాపాపాత్ముల దారుణ ప్రయత్నమును జెప్పఁజాలకున్నాను.

రతి—ప్రాణనాథా! అది యెటువంటిది?

కాము—ఓ ప్రియురాలా! భయపడఁబోకుము. వారివి కేవల హంతాకు లయినవారి కోరిక లేసుమా! ఇప్పుడు కాళికాశక్తితో సమానురా లయినవిద్య యను రాక్షసియొక్కతె మనవంశమునందుఁ బుట్టునని లోకప్రవాద మొకటి పుట్టినది.

రతి—(భయముతో) ఏమిగతి! మనకులమునందు రాక్షసి యెట్లు పుట్టునా యని నాహృదయము కంప మెత్తుచున్నది.

కాము—ప్రియురాలా! జడియకు జడియకు. ఇది పట్టికింపదంతియే సుమా.

రతి—కఱవాత నారాక్షసి చేయఁగలపని యేమి?

కాము—ప్రియురాలా! బ్రహ్మదేవుని భార్య సరస్వతి యనియొకతె యున్నదికదా! ఆమె యీప్రకారము చెప్పినదఁట.

స్రగ్ధర

సంగంబుల్ లేని యీమాయీశ్వరునివలన సంసర్గముల్ లేకయే లీలం గాంచెన్ భార్యమాయాలలనమనసనన్ శ్లాఘ్యపుత్రుల్ జగంబుల్
పొంగారన్ పీరివంశంబునన పొడమెడున్ బుత్రియు న్విద్య నాఁగన్;
ద్రుంగుందద్విద్య తండ్రిన్ బ్రియజననిని భ్రాతృప్రపంచంబుల్ గులంబున్.

రతి—(భయోత్కంపముతో) ఓ ప్రాణవల్లభా! రక్షింపుము. రక్షింపుము. (అని భర్తను కౌఁగిలించుకొనుచున్నది)

కామ—(స్పర్శసుఖ మభినయించి తనలో)

చ. పులకలు కూడఁ జూపులను బొల్పుగఁ దారకలాడఁ బైపయిన్
వలుదకుచద్వయంబు భయభావమునన్ వడఁకాడఁ గంకణా

వళి చిఱుపాటపాట, భుజవల్లుల నీతరళాక్షి కౌఁగిటన్
జెలుఁగఁ జేర్చు సొంపలరఁ జేసి. నను న్వివశాత్ముఁ జేసెడున్.
(గాఢాలింగనము చేసికొని ప్రకాశముగా) ప్రియురాలా! బెదరకు బెదరకు. మేము జీవించియున్నంతవఱకును విద్య యెక్కడఁబుట్టును?

రతి—ఆరాక్షసి పుట్టుట మీ ప్రతిపక్షులకు సమ్మతమా యేమి?

కాము—అవును సమ్మతమే. ఆవిద్య వివేకున కుపనిషద్దేవి యందుఁ బ్రబోధచంద్రుఁ డను సోదరునితోఁడఁ గూడఁ బుట్టబోవుచున్నది. శమదమాదులందఱు నందులకు మహాప్రయత్నము చేయుచున్నారు.

రతి—ఓ హృదయేశ్వరా! ఆత్మవినాశహేతు వయిన విద్య యొక్క యుత్పత్తి కాఁదుర్వినీతు లెట్లు సంతోషించుచున్నారు?

కాము—ఓ ప్రియురాలా! కులక్షయప్రవృత్తు లయి యున్న పాపకర్ములు ప్రత్యపాయము నెట్లు గణింతురు? చూడు.

చ. అరయ స్వభావదుష్టకుటిలాత్ములసంభవ మెల్లయుప్పుకున్
గరము వినాశహేతువగుఁగా తమకుం దముఁగన్నవారికిన్!
ధరణిని ధూమసంచయము తా నలమేఘపదంబు నొంది స
త్వరముగ నగ్ని నార్చి తరువాతను దానును నాశ మొందదే!

[తెరలో]

ఆ! పాపీ! దురాత్మా! ఏమిరా పాపకర్ములమని మమ్మే యాక్షేపించుచున్నావు! ఔరా!

గీ. “గర్వితుం డైన, దుర్మార్గగామి యైనఁ,
దా నొకింత కార్యాకార్యదక్షబుద్ధి

కానివాఁడైన, గురునేని కార్య మెంచి
వసుధలోఁ బలఁ ద్యజియింపవలయుఁ జుమ్మి."

అను పౌరాణికగాధను బురాణవేత్త లుదాహరించి యున్నారు. అదిగాక యీ మాజనకుఁడే యహంకారునితోఁ జేరి తనతండ్రి యైన జగత్పితను బంధించి యున్నాఁడు. అతనిని మోహాదులుకూడ దృఢపాశబద్ధుని జేసి యున్నారు.

కాము—ఓప్రియురాలా! అదె మాకులవృద్ధుఁడైన వివేకుఁడు భార్య యగు మతిదేవితోఁగూడ నిక్కడకే వచ్చుచున్నాఁడు.

మ. వనితా! చూడుము చిక్కి మానదనుఁ డావంక న్వివేకుండు తె
ల్వినిఁ గన్పట్టెడుఁ గాంతి కోల్పడి, కడుఁ న్స్వేచ్ఛానుసంచారులౌ
ఘనరాగాదులచేఁ గలంగిన మతిన్సాత్మభృత్యుంచుఁ గూడి, కా
ఱ్ఱోకనుపెన్నంచునఁ గాంతివాసినశశాంకుంబోలె భీతాత్ముఁడై.

ఇఁక మన మిక్కడ నిలువఁగూడదు. (అని నిష్క్రమించుచున్నారు)

ఇది విష్కంభము

[అప్పుడు వివేకమహారాజును మతిదేవియుఁ బ్రవేశించుచున్నారు]

వివే—(ఆలోచించి) ఓప్రియురాలా! దుర్నీతుఁ డయిన యీబ్రహ్మచారియొక్క గర్వయుక్త మయినమాటను నీవు విన్నావు గదా? వీఁడు పాపాత్ముల మని మనలనే యాక్షేపించుచున్నాఁడు!

మతి—ప్రాణేశ్వరా! లోకులు తమదోషముల నేల యెఱుఁగ జాలరు?

వివే—ప్రియురాలా! చూడు.

శా. ఆహా! పాశముల న్నిరంజనుని జ్ఞానానందు నయ్యీశ్వరున్
మోహాంభోనిధిలోఁ జిరంబుగఁ గీరంబు న్ముంచి బాధించి గా

ధాహంకారపరుల్ దురాత్మకులు నాయాదుర్మదాదుల్ మహో
త్సాహం బొప్పఁగ నీశు దీనదశ నొందంజేసి రత్యంతముఁ.

అట్టివారు పుణ్యాత్ములఁట! ఆదురాత్ములచేతఁ బరాభవింపఁబడిన యీశ్వరుని విముక్తుని జేయుటకయి ప్రవర్తింపుచున్నమన మేమో పాపకారుల మఁట!

మతి—ఓ ప్రాణేశ్వరా! పరమేశ్వరుఁడు సహజానందసుందర స్వభావుఁ డనియు నిత్యప్రకాశుఁ డనియుఁసకలభువనప్రచారుఁడనియు వినుచుందుము, అట్టివాఁడేల యీదుర్నీతులచే బంధింపఁబడి మహా మోహసాగరమునందు మునిఁగి పోయినాఁడు?

వివే—ఓ ప్రియురాలా!

సీ. సతతమహోన్నత ధృతిమంతుఁ డయ్యును
సదమలసంపూర్ణ శాంతుఁడయ్యుఁ
ప్రబలతరైశ్వర్యభాసమానుండయ్యు
మహితసంతతనీతిమంతుఁడయ్యు
నసమానఘననిశ్చలాంతఃకరణుఁడయ్యు
సమయానుగుణధీవిశాలుఁడయ్యుఁ
దరుణులమాయలఁ దగులొందిపురుషుండు
త్యజియింపఁడే తనధైర్యగరిమ?
నల్లె యామహాపురుషుండు నరయ నిపుడు
వఱలుమాయామహాదేవివలలఁ దగిలి
చిరతరానూనసంబంధగరిమ కతనఁ
దన్నుఁ దా నెఱుఁగంగఁ జాలకున్నవాఁడు.

మతి—ఓప్రాణేశ్వరా! అట్లు సంభవింపదు. సహస్రకిరణుఁడైన సూర్యుఁ డంధకారరేఖచేతఁ గప్పఁబడుట సంభవించునేని,

అప్పుడు దేదీప్యమానప్రకాశసాగరుఁ డైన యాదేవుఁడును మాయచేత నడఁగియుండుట తటస్థింపవచ్చును.

వివే—ఓప్రియురాలా! ఆమెజాడ యిట్టిదని యూహించుట మనకు శక్యముకాదు. వారకాంతవలెనే యామాయాదేవి యసత్యము లయినభావములను గనఁబఱుచుచుఁ దానా పరమపురుషుని వంచించుచున్నది. చూడు చూడు.

చ. స్ఫటికముభంగి స్వచ్ఛరుచి భాసిలుదేవు స్వయంప్రకాశునిన్
గటకట! యల్మురాలయి వికారవిధేయునిఁ జేసె మాయ; ప్రా
కటమగు దానిసంగతిని కాంతి నొకింతయుఁ గోలుపోఁ డతం
డటు లయియున్, ఘటించెడును నాతని కామె యధీరతం గడున్.

మతి—దుర్విదగ్ధురా లయిన యామె యేకారణముచేత నుదారచరితుఁ డయిన యామహామహుని వంచించుచున్నది?

వివే—ప్రయోజనమునుగాని కారణమునుగాని విచారించి మాయ వర్తించుచుండలేదు. స్త్రీపిశాచముల కది స్వభావమే. చూడు.

చ. నరులదయార్ద్రకోమలమనంబులు లోఁగొని వామలోచనల్
సరగున నేమిచేయుటకుఁ జాలరు తారు ధరాతలంబునన్?
పురుషుల మోహపెట్టుదురు, బుద్ధిగలంతుర్, విషాదపెట్టుదుర్
మరి వెఱపింతుఁ రాసలఁ గరంతురు, చేయుదు రాత్మదాసులన్.

మఱియొక కారణముగూడఁ గలదు.

మతి—ప్రాణేశ్వరా! అదియేది?

వివే—దురాచారురా లయిన యామె "నేనిప్పుడు యౌవనము పోయి యేండ్లు చెల్లినదాన నయి యున్నాను. ఇతఁడును బురాణపురుషుఁడు; స్వభావముచేతనే విషయసుఖవిముఖుఁడు. కాబట్టి నా

తనయునినే పరమేశ్వరపదమునందు నిలిపెదను'' అని యాలోచించి నది. తల్లియభిప్రాయము నెఱింగి భేద మేమియు లేక యామెనే పోలిన మనస్సును నవద్వారములు గలపురములను నిర్మించెను.

గీ. ఒక్కఁడయ్యును వహియించి పెక్కురూపు
లలశరీరపురంబుల నతఁడు చొచ్చి,
స్ఫటికమణిఁబోలి యాత్మచేష్టలను దాను
వానివానికిఁ దగ నలవఱ్చుకొనియె.

మతి—(ఆలోచించి) ఓప్రాణేశ్వరా ! తల్లి యెటువంటిదో పుత్రుఁడు నటువంటివాఁడే పుట్టునుగదా!

వివే—అప్పుడు మనస్సుయొక్క జ్యేష్ఠపుత్రుఁడును దనమున్మనుమఁడునునయిన యహంకారుఁడు వచ్చి తన్నుఁగౌఁగిలించుకొనఁగాఁ బరమాత్ముఁడు—

చ. బ్రమసి, యవిద్యచేయు నిదురంబడి, యీశ్వరుఁ డామనస్సుచే
యుమహితకల్పనం దగిలి, 'యుద్భవమందితి; వీరు నాపితల్;
విమతులుఁ బుత్రమిత్రులును వీరె; కులంబు బలంబు విద్య ద్ర
వ్యము నివె; భార్య యీమె' యని స్వప్నములీయవి పెక్కు
లొందెడున్.

మత్రి—ఓప్రాణేశ్వరా! ఈప్రకారముగా నతిదీర్ఘతర మయిన నిద్రచేతఁ బ్రబోధము చెడియున్న పరమేశ్వరునియందుఁ బ్రబోధ సంభవ మెట్లు కలుగును?

వివే—(లజ్జతో నధోముఖుఁడయి యున్నాఁడు.)

మతి—ప్రాణేశ్వరా! గురుతరలజ్జాభరముచేత శిరస్సు వంచుకొని యూరకున్నారేమి ?

వివే—ప్రియురాలా! స్త్రీలహృదయములు కలుచుగా నీర్ష్య

నుబొందును. అందుచేత నేను సాపరాధుండ నగుదునుగదా యని శంకించుచున్నాను.

మతి—ప్రాణేశ్వరా! అన్యాశ గలిగిన స్త్రీలు మాత్రమే తన కనురక్తుడయి ధర్మార్థవ్యాపారమునందుఁ దగిలి యున్న భర్త యొక్క మనోభీప్సితములకు విఘ్నములు చేయుదురు.

వివే—ఓప్రియురాలా!

శా. ఉగ్రోద్యద్విరహార్తయా నుపనిషద్యోషిన్మణీయోగ మ
య్యుగ్రశ్లాఘ్యుల శాంతిముఖ్యులనుసాహాయ్యాప్తి నాకబ్బినన్
జాగ్రత్తక్షణకాలమీవు విషయేచ్ఛల్ మానివర్తించినన్,
జాగ్రత్స్వప్నసుషుప్తిధామవిరతిన్ గల్గుం బ్రబోధుండిలన్.

మతి—ఓప్రాణవల్లభా! అహంకారాభిమానియైనను గులప్రభునకు బంధమోక్షము కలిగెడు పక్షమున, అప్పుడు దేవరవారికామెతోడి నిత్యానుబంధము కలుగునుగాక యనియే నాకోరిక.

వివే—ఆలాగున నయినపక్షమున, నామనోరథము లచిరముగాఁ బ్రసన్నములును సిద్ధములు నయినట్లే. అట్లేకదా—

సీ. జగముల కాదియు శాశ్వతుండుఁ బ్రభువు
నై వెలుగొందుమహానుభావు
బహువిధంబులఁ దాము భాగించి, దేహని
వేశంబులందుఁ బ్రవేశపెట్టి
బద్ధునిగాఁ జేసి, పరమమృత్యుపదంబు
ప్రాపించునట్లుగఁ బదిలపఱిచి,
యుడరుబ్రహ్మద్రోహులై నయువ్వారికి
మరణాంతికంబయి మఱియు శాస్త్ర

విహితమైన ప్రాయశ్చిత్తవిధిని నేను
మహితవిజ్ఞానమహిమచే మహి నొనర్చి,
మరల స్థాపించువాఁడఁబో స్థిరముగాను
బూని బ్రహ్మైకభావంబుఁ బుడమిమీఁద.

అట్లగునుగాక! ప్రస్తుత కార్యసిద్ధికొఱకుఁ బ్రబోధోత్పత్తినిమిత్తము శమాదులను సమకూర్తము.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయాంకము

[అంతట దంభుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దంభు—"వత్సా! రంభా! అమాత్యసహితుఁడయి వివేకుఁడు ప్రబోధోదయార్థముగా శమదమాదుల నాయాతీర్థములకుఁ బంపియున్నాఁడని విన్నాఁడను. ఆసన్నమగుచున్న మనయీకులక్షయమును మాన్పుటకయి మీరు శ్రద్ధ వహించి ప్రతిక్రియ చేయవలెను. భూమండలములోఁ బరమముక్తిక్షేత్రమయి వారణాసీనగర మున్నది. నీ వందుఁబోయి నాలుగాశ్రమములవారియొక్కయు మోక్షకార్యవిఘ్నమునిమిత్త మతిప్రయత్నము చేయవలెను." అనిమహామోహమహారాజుగారు నాకాజ్ఞాపించియున్నారు. కాఁబట్టినాకు వశ్యులయిన వారితో నిండియున్న యీ వారణాసీపురమునందు నేనిప్పుడు మా ప్రభువువారు సెలవిచ్చినట్లుగా వారియాజ్ఞలను నిర్వహించితిని. ఇప్పుడిక్కడ నాయాశ్రితులు (దాంభికులు)

చ. గణికలయిండ్లఁ గంపొదవుకాంతలయానసనీధు వానుచుం,
బ్రణుతరతోత్సవంబులను రాత్రులు వెన్నెలలోనఁ బుచ్చి, బ్రా

హ్మణుల మటంచు దీక్షితులమంచుఁ దపస్వులమంచుఁ బండితా
గ్రణులమటంచు ధూర్తులుజగంబును ఘోరమొనర్తురెంతయున్.
(చూచి) భాగీరథినిదాటియిప్పుడీవంక నేవచ్చుచున్నాఁడు. ఈపాంథుఁ డెవఁడయియుండును?

గీ. ఒకట నభిమానమున మందుచున్నయట్లు;
మించి లోకత్రయంబును మ్రింగునట్లు,
పృథులవాగ్జాలమున బెదరించునట్లు,
ప్రజ్ఞచే నవ్వునట్లుఁ, గన్పడెడు నితఁడు.

ఇతఁడు దక్షిణరాధా దేశమునుండి వచ్చియుండు నని నేనూహించె దను. కాఁబట్టి నేనితనివలనఁ బూజ్యుండయిన యహంకారునివృత్తాంతమును దెలిసికొనెదను.

[అప్పుడు పయినిజెప్పినట్లహంకారుఁడు ప్రవేశించుచున్నాఁడు]

అహం.—ఓహో! ఈజగత్తంతయు మూర్ఖమయ మయి యున్నది. ఎట్లన—

చ. గురుమతము న్వినంగనరు; గోప్యకుమారిలశాస్త్రరీతిఁ గా
నరు; విన రాప్రభాకరేఁ డొనర్చినబోధ; యిఁకేల దేవతా
గురుకథ? శేషుభాష్యమును గోరరు; సూక్ష్మపదార్థతత్వముల్
నరపశువుల్ గ్రహింపరు; తలంపరు పాశుపతంబు స్వస్థులై.

(చూచి) వీ రర్థజ్ఞానశూన్యులు; కేవల స్వాధ్యాయపరులు; వేదములను నీటఁ గలుపుచున్నారు. (మరలి మఱియొక చోటికినడచి) వీరు భిక్షులకొఱకే యతివేషములను గ్రహించినారు; శిరోముండనములు చేసికొన్న యీపండితంమన్యులు వేదాంతశాస్త్రమును బాడుచేయుచున్నారు. (నవ్వి)—

గీ. మహిని ప్రత్యక్షముఖ్య ప్రమాణసిద్ధ
ఘనవిరుద్ధార్థములు వీరు జనములకును
బోధ చేయుచునుండఁగఁ, బుడమిమీఁద
బౌద్ధవాదులకడఁ గలపాప మేమి?

ఇట్టి వీరిసంభాషణలు విన్నను మహాపాతకము సంభవించును. (మరల మఱియొక చోటికి నడచి) వీరు కష్టపడి తర్కమతము నభ్యసించిన శైవపాశుపతాదులు ఈపాషండులు కేవలపశువులే. వీరితో సంభాషించినవారు సహితము నరకమునపా లగుదురు. అందుచేత వీరిని దృష్టిపథమునుండి దూరముగాఁ బరిహరింపవలయును. (మరల మఱియొక చోటికి నడచి)—

ఉ. అల్లదె గంగయొడ్డు శిలలందుఁ గుశాస్తరణోపవిష్టులై,
యల్లన దర్భముష్టియుతహస్తము లొప్పఁగఁ, బూజపెట్టె ల
ల్లల్లన నిల్పి, పూస లెగయుం గొనవ్రేళుల నక్షమాలికల్
పెల్లుగఁ ద్రిప్పుచున్, ధనికవిత్తములన్ హరియింత్రు దాంభికుల్.

(మరల మఱియొక చోటికినడచి) వీరు త్రిదండి వేషములచేత జీవనము చేసెడు ద్వైతాద్వైతమార్గపరిభ్రష్టులు. (మరల వేఱొక చోటికి నడచి చూచి) ఓహో! ద్వారసమీపమునందు నాటిన నిడుదలగు వెదురుగడలకుఁ గట్టియున్న తెల్లనిసూక్ష్మవస్త్రసహస్రములు పయిని దాండవ మాడుచుండఁగా, క్రిందనందందుఁ గృష్ణాజినములును సన్నెకండ్లును యజ్ఞపాత్రములును జపాలములును ఱోళ్లును రోకళ్ళును బ్రకాశింపఁగా, నిరంతరహుతాజ్యవాసనతో నిండినధూమములచేత గగనమండల మంతయు నల్లపడఁగా గంగాసమీపమునందుఁ బ్రకాశించుచున్న యీయాశ్రమపద మెవ్వరిదయి యుండును? ఇది నిశ్చయముగా నెవ్వరిదో యొకదొడ్డగృహస్థుని గృహమై యుండును.

కానిమ్ము. అతిపవిత్ర మైనయిది నేను రెండుమూఁడుదినములు వాసము చేయుటకు యోగ్యమయినదిగాఁ గనఁబడుచున్నది. (అని ప్రవేశించి చూచి) ఆహా!

చ. ఉదరమునన్ భుజంబులను నూరువులన్ గళమందు ఫాలమునన్
బెదవులఁ జెక్కులన్ మకుట వీపున గడ్డమునందు జానులన్
బదునుగ బొట్లుపెట్టి, కటిఁ బాణులఁ గర్ణములందు జుట్టునం
దుదుటున దర్భలుంచి, యితఁడొప్పెడు దంభము రూపమొందెనాన్.

మంచిది. నేనతనిసమీపమునకుఁ బోయెదను. (సమీపమునకుఁ బోయి) నీకు శుభ మగునుగాక!

దంభు—(హుంకారముచేత నాతని నదలించుచున్నాఁడు.)

వటుఁడు—(ప్రవేశించి తొట్రుపాటుతో) ఓబ్రాహ్మణుఁడా! దూరముగా నిలుచుండు. పాదప్రక్షాళనము చేయక యీయాశ్రమపదములు త్రొక్కఁగూడదు.

అహం—అయ్యో! నేనెక్కడనో పాపతురుష్కదేశమునకు వచ్చినాఁడను. ఇక్కడ శ్రోత్రియు లయినయతిథులను గృహస్థు లాసనపాద్యాదులచేత నయిన నెదుర్కొన కున్నారు.

దంభు—(చేసైఁగచేత నూఱడించుచున్నాఁడు.)

వటు—దూర దేశమునుండి వచ్చిన మీకులశీలాదికమును జక్కఁగా విచారింపు మని మాగురువులవా రాజ్ఞాపించుచున్నారు.

అహం—ఏమీ! ఇప్పుడు మాకులశీలాదికమును గూడఁ బరీక్షింపవలయునుగా! వినుము—

ఉ. ఉత్తమమన్వి గౌడమహి; యుత్తమమందును రాధికాపురం;
బుత్తమమందు శ్రేష్ఠికుల; ముత్తముఁడందును నాదుతండ్రిః స

ర్వోత్తములెన్నఁ దత్తనుజు; లుత్తముఁడంగడు నేను వారిలో
నుత్తమబుద్ధిధైర్యవినయోఱువివేకసుశీలతాదులన్.

డంభు—(వటునివంకఁ జూచుచున్నాఁడు.)

వటు—(తామ్రకలశమునుపట్టుకొని వచ్చి) దేవా! పాదశౌచ మును జేసికొండు.

అహం—(తనలో) కానిమ్ము. ఇట్లుచేసికొనుటవలన దోష మేమున్నది? (అలాగుసఁజేసి దాపునకు వచ్చుచున్నాఁడు.)

డంభు—(పండ్లుకొఱికి) నీవు దూరముగా నిలుచుండుము. గాలితోఁ గలిసి చెమటబిందువులు మామీఁదికి వచ్చును.

అహం—ఓహో! ఈబ్రాహ్మణ్య మపూర్వ మయినదిగా నున్నదే.

వటు—ఓబ్రాహ్మణా? అందుకు సందేహమేమి? వీరి సన్నిధిని—

గీ. పూజ్యపాదాబ్జయుగళంబు ముట్టుకొనక,
భక్తిఁ బీఠాంతభూతల భాగమునకె
స్వీయచూడామణి మరీచివితతిచేత
నృపతివరులు నీరాజనం బిడుదు రెపుడు.

అహం—(తనలో) ఈ దేశము కేవలదాంభికుల కనుకూల మయినది. కానిమ్ము. ఈపీఠముమీఁద గూరుచుండెదను.

(అని కూరుచుండఁ బోవుచున్నాఁడు.)

వటు—ఆరాధ్యపాదులవారి యీపీఠము నన్యులాక్రమింపఁ గూడదు.

అహం—ఓరి పాపాత్ముఁడా! దక్షిణరాధా దేశమునప్రసిద్ధుల

యిన మా వంటి పరిశుద్ధులకుఁ హిత మీ పీఠము నెక్కఁదగరా? ఓరి మూర్ఖా! మా కులశీలములు వినుము—

ఉ. మాత మహాకులీన; మఱి మత్సతిశ్రోత్రియపుత్రి; యాటనేఁ
  బూతుఁడఁ దండ్రికంటెఁ; వినఁ పూర్వము మత్సతియన్న మిత్రుఁడ
  న్మాతులపుత్రిమీఁద నణుమాత్రి మబద్ధపునింద రా, నప
  ఖ్యాతపుబాంధవంబసి ప్రియాంగనఁ బోనిడి నైతి శుద్ధుఁడన్.

దంభు—ఓ బ్రాహ్మణా! అదియంతయు నట్లేయయియుండును, అయినను నీకు మా వృత్తాంతము తెలియదు.

చ. మును పొకసారి బ్రహ్మపురముం గనివచ్చుట కేను బోవఁగా,
  మునివరులాత్మ పీఠచయముం డిగి రెల్లరు నన్నుఁ జూచి; యా
  వనజభవుండు నన్నుఁ బ్రియభాషలఁ దేఱిచి, శుద్ధిగాఁగ ది
  గ్గున నుపవిష్టుఁ జేసె నవగోమయలిప్తనిజోరుపీఠికన్.

అహం—(తనలో) ఆహా! ఏమి యీ దాంభిక బ్రాహ్మణుని యత్యుక్తి (ఆలోచించి) ఇతఁ డొకవేళ దంభుఁడే యేమో? అయినంగానిమ్ము. (కోపముతో బిగ్గరగ) ఓరీ! నీ వేల గర్వపడెదవు?

చ. శతముఖుఁ డెంతవాఁడు? మఱి సారసగర్భుఁడనంగ నెంత? యీ
  క్షితిపతు లేమి లెక్క మునిసింహులు? లెఱుంగవు నీవు మత్తప
  స్తతమహిమంబు వాసవశతంబును బ్రహ్మశతంబు పోని రా
  ట్సతమును గూలలేదె వరుసన్ గతిగానక నేను జూడఁగన్.

దంభు—(చూచి సంతోషముతో) ఓహో! అయ్యా! మీరు నా పితామహులైన యహంకారులు. దేవా! లోభుని యాత్మజుఁడ నయిన దంభుఁడను నేను మీకు నమస్కారము చేయుచున్నాను.

అహం—వత్సా! దీర్ఘాయుష్మంతుడవుకమ్ము. నేను ద్వాపరాంతమునందుఁ జూచినప్పుడు నీవు బాలుఁడవు. చిర కాల మెడఁబాసి

యుండుటచేతను వార్ధక్యగ్రస్తుఁడ నగుటచేతను నిన్నిప్పుడు తిన్నగా గుఱుతుపట్టలేక పోయినాఁడను. మఱి నీకుమారుఁడయిన యసత్యునకుఁ గుశలమా?

దంభు—అతఁడు క్షేమముతోనున్నాఁడు. అతఁడును మహామోహమహారాజుగారి యాజ్ఞననువర్తించుచు నిక్కడనే యున్నాడు. అతనిని విడిచి నేనొక్క ముహూర్తకాల మయినను బ్రాణములు నిలుపఁ గలుగుదునా?

అహం—నీతల్లిదండ్రులయిన తృష్ణయు లోభుఁడును గుశలు లయియున్నారా?

దంభు—వారును నిక్కడనే యున్నారు. వారులేక నేనుక్షణ మయినను నిలువలేను. పూజ్యులయిన తమరిక్కడ కేమిపనిమీఁద దయచేసినారు?

అహం—వత్సా! వివేకునివలన మహామోహున కేమోయుపద్రవము కలుగనున్నదని విని యాతని వృత్తాంతమును దెలిసికొన వలెనని వచ్చినాను,

దంభు—తమరాక మేలయినది. మహామోహమహారాజుగారింద్రలోకమునుండి నేటరేపటనిచ్చటకే వచ్చుచున్నారని విన్నాను. ఆయన యీవారణాసీనగరమునే రాజధానిగాఁ జేసికొందు రనియు నొకలోకప్రవాదము పుట్టినది.

అహం—సమస్తాత్మలయందును వాసముచేసెడు మహామోహుఁడీవారణాసియం దుండఁగోరుటకుఁ గారణమేమి?

దంభు—మఱియేమున్నది? వివేకుని నడ్డగింపవలయుననియే.

గీ. శాశ్వతబ్రహ్మపురి కాశి, జన్మభూమి
యవని విద్యాప్రబోధోదయముల కరయఁ;